Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU




అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 332 పేజీలు (Pages): 8 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శుక్రవారం, 21 - 8 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం: 2015

# దక్షిణాది ప్రగతికి సమష్టి అడుగులు

**- రాష్ట్రాల మధ్య సహకారంతోనే వికసిత్ భారత్ లక్ష్యం - 2047 నాటికి 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా దక్షిణాది రాష్ట్రాలు - ఏపీ పునర్విభజన చట్టంలో అపరిష్కృత అంశాలపై తక్షణ నిర్ణయం - షెడ్యూల్ 9, 10 సంస్థల విభజనపై త్వరిత నిర్ణయం తీసుకోవాలని కేంద్రానికి విజ్ఞప్తి - గోదావరి-కావేరి అనుసంధానంతో 500 టీఎంసీలకు పైగా వరద జలాల సద్వినియోగం - కుప్పం మీదుగా బుల్లెట్ రైలు.. దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి మౌలిక వసతుల ప్రతిపాదనలు - 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో ప్రసంగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు**










**మహాబలిపురం, (రాజధాని వార్తలు):** రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలను పరస్పర సహకారం, సమన్వయంతో పరిష్కరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. దక్షిణాది రాష్ట్రాలు కలసికట్టుగా ముందుకు సాగితే భారతదేశ అభివృద్ధికి మరింత బలమైన చోదకశక్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. 2047 నాటికి దక్షిణ భారత్ 10 ట్రిలియన్ డాలర్లకు పైగా ఆర్థిక వ్యవస్థగా ఎదిగే సామర్థ్యం ఉందన్నారు. తమిళనాడులోని మహాబలిపురంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా అధ్యక్షతన జరిగిన 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో సీఎం చంద్రబాబు ప్రసంగించారు. 24 అంశాలతో కూడిన ఎజెండాపై సమావేశంలో చర్చించారు. ఏపీ సహా దక్షిణాది రాష్ట్రాల సమగ్ర అభివృద్ధి గురించి ముఖ్యమంత్రి తన ప్రసంగంలో ప్రస్తావించారు. దక్షిణాది రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం సాధించటమే లక్ష్యమని సీఎం పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్రాల మధ్య విశ్వాసం, పరస్పర సహకారంతో సమస్యల పరిష్కారం జరగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ఏపీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలను కలుపుతూ కుప్పం మీదుగా బుల్లెట్ రైలు కారిడార్‌ను అభివృద్ధి చేయాలని చంద్రబాబు ప్రతిపాదించారు. అమరావతి-బెంగళూరు-చెన్నై నగరాలను అనుసంధానించే ఈ మార్గం మూడు రాష్ట్రాల మధ్య ఆర్థిక కార్యకలాపాలకు మరింత ఊతం ఇస్తుందని వివరించారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఉమ్మడి లాజిస్టిక్స్ నెట్‌వర్క్, డ్రై పోర్టుల ఏర్పాటు, దక్షిణ గ్రిడ్‌ను జాతీయ విద్యుత్ గ్రిడ్‌తో అనుసంధానం చేయడం, యూనివర్సిటీలు, ఇతర స్కిల్లింగ్ సంస్థలతో కలిసి సంయుక్త నైపుణ్యాభివృద్ధి వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రకృతి విపత్తుల సమయంలో ఏ రాష్ట్రం ఒంటరిగా ఉండకుండా పరస్పర సహాయానికి ప్రత్యేక విపత్తు నిర్వహణ టాస్క్ ఫోర్సును ఏర్పాటు చేయాలని కేంద్రానికి ప్రతిపాదించారు.

**తిరుపతి నుంచి అయోధ్య వరకు తీర్థయాత్ర సర్క్యూట్**

దక్షిణాది ప్రముఖ పుణ్యక్షేత్రాలను ఉత్తర భారతదేశంలోని ఆధ్యాత్మిక కేంద్రాలతో అనుసంధానిస్తూ ప్రత్యేక వారసత్వ, పర్యాటక, తీర్థ యాత్ర సర్క్యూట్ ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. తిరుపతి, శ్రీశైలం, కాంచీపురం, మధురై, రామేశ్వరం, మైసూరు వంటి ప్రాంతాలను వారణాసి, అయోధ్య, చార్ ధామ్ ప్రాంతాలతో అనుసంధానించడం ద్వారా దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక పర్యాటకానికి ప్రోత్సాహం కల్పించే అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి ప్రతిపాదన చేశారు. దేశ స్థూల ఉత్పత్తిలో దక్షిణాది ఐదు రాష్ట్రాల వాటా ప్రస్తుతం 31 శాతంగా ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. 2047 నాటికి భారత్ 30-35 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న లక్ష్యానికి దక్షిణాది రాష్ట్రాలు ప్రధాన భూమిక పోషిస్తాయని తెలిపారు. ఏపీ 2.4 ట్రిలియన్ డాలర్లు తమిళనాడు 2.6, కర్ణాటక 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థలుగా లక్ష్యాలు నిర్దేశించుకున్నాయని సమష్టిగా దక్షిణ భారత్ లోని రాష్ట్రాలన్నీ 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదుగుతాయని ముఖ్యమంత్రి వివరించారు.

**విభజన హామీల పరిష్కారం**

ఆంధ్రప్రదేశ్ పునర్విభజనకు సంబంధించిన పెండింగ్ అంశాలను చంద్రబాబు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్ర విభజన జరిగి 12 సంవత్సరాలు గడిచినా షెడ్యూల్ 9, 10లోని సంస్థల విభజన పూర్తి కాలేదని పేర్కొన్నారు. ఆస్తులు, అప్పులు, సంస్థల విషయంలో సమ న్యాయం జరగాల్సిన అవసరం ఉందన్నారు. విభజన చట్టంలోని సెక్షన్ 66 కింద ఉన్న అంశాలపై కేంద్ర నిర్ణయం కోసం గడచిన 9 ఏళ్లుగా ఎదురుచూస్తున్నామని అన్నారు. విభజన చట్టంలోని సెక్షన్ 56లోని సమస్యలు, వనరుల లోటు, ఆర్థిక భారానికి సంబంధించిన అంశాలను కూడా పరిష్కరించాలని కేంద్రాన్ని కోరారు. ఏపీ అభివృద్ధిలో కేంద్రం అందిస్తున్న సహకారానికి చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. హామీ ఇచ్చిన 11 జాతీయ సంస్థల్లో 10 ఇప్పటికే ఏర్పాటు కావడం సంతోషదాయకమని అన్నారు. పోలవరం, సౌత్ కోస్ట్ రైల్వే జోన్, అమరావతి నిర్మాణంలో కేంద్ర సహకారం కీలకమన్నారు. ఢిల్లీలోని ఏపీ భవన్ అంశాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రస్తావించారు. అమరావతి రాజధానికి చట్టబద్ధత కల్పించిన కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు. నీటి వనరులు, పచ్చదనం, జీవన ప్రమాణాలు, కనెక్టివిటీ, ఆర్థిక అవకాశాలను దృష్టిలో ఉంచుకుని నూతన రాజధాని నిర్మాణం చేస్తున్నామని సీఎం వివరించారు. చట్టంలోని షెడ్యూల్-13 కింద ఉన్న ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇవ్వాలని సీఎం కోరారు. విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్, మూడు విమానాశ్రయాల అభివృద్ధి, కొత్త రాజధానికి రైలు అనుసంధానం వంటి పనులు వేగంగా పూర్తి చేయాలని కోరారు. దుగరాజపట్నం పోర్టు, బీపీసీఎల్ రిఫైనరీ, విశాఖ, విజయవాడ నగరాల్లో మెట్రో రైలు ప్రాజెక్టులు, కడపలోని జిందాల్ స్టీల్ కు రైలు అనుసంధానంపై అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

**నీటి భద్రతకు గోదావరి-కావేరి అనుసంధానం**

భవిష్యత్ నీటి భద్రతకు నదుల అనుసంధానమే శాశ్వత పరిష్కారమని చంద్రబాబు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి, కృష్ణా, వంశధార, నాగావళి, పెన్నా వంటి 40 నదులు 28 జిల్లాలకు సాగునీటిని అందిస్తున్నాయని తెలిపారు. గోదావరి-కావేరి అనుసంధానంలో భాగంగా పోలవరం, కృష్ణా, పెన్నా మీదుగా 500 టీఎంసీలకు పైగా మిగులు వరద జలాలను కావేరి బేసిన్‌కు తరలించే ప్రతిపాదనను సీఎం కేంద్రం ముందు ఉంచారు.

ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు ప్రయోజనం కలిగిస్తుందని అన్నారు. గంగా-కావేరి అనుసంధానాన్ని జాతీయ ప్రాజెక్టుగా చేపట్టాలని సూచించారు. గంగా నది మిగులు జలాలను దక్షిణాది ప్రాంతా లకు తరలించడం ద్వారా తమిళనాడుతో పాటు దక్షిణాది రాష్ట్రాల నీటి భద్రతకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. నదీ పరివాహక ప్రాంతాల మధ్య సమన్వయానికి ప్రత్యేక దక్షిణాది నదీ బేసిన్ల సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, డీపీఆర్‌లు, అనుమతులను కాలపరిమితిలో పూర్తి చేయాలని కేంద్రాన్ని కోరారు. కేంద్ర-రాష్ట్ర సంబంధాల్లో పరస్పర విశ్వాసం, రాష్ట్రాల మధ్య సహకారం, సమష్టి అభివృద్ధి ప్రధాన లక్ష్యాలుగా సదరన్ జోనల్ కౌన్సిల్ పనిచేయాలని చంద్రబాబు ఆకాంక్షించారు. కౌన్సిల్‌లో తీసుకున్న నిర్ణయాలు త్వరితగతిన అమలు అయ్యేలా చూడాలని స్పష్టం చేశారు.

సీఎం చంద్రబాబు ప్రసంగాన్ని దక్షి ణాది రాష్ట్రాల సీఎంలు ప్రసంశించారు. ఈ సమావేశంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, తమిళనాడు ముఖ్యమంత్రి జోసఫ్ విజయ్, కర్ణాటక సీఎం డీకే శివకుమార్, తెలంగాణా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, కేరళ సీఎం వి.డి. సతీషన్, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కె.కైలాష్ నాథన్, అండమాన్ నికోబార్ లెఫ్టినెంట్ గవర్నర్ అడ్మిరల్ డి.కె.జోషి సహా ఆయా రాష్ట్రాల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## 'వందేమాతరం'పై కాంగ్రెస్ నిర్ణయం దేశాన్ని అవమానించడమే : అమిత్‌షా



**ఇంటర్నెట్ డెస్క్:** 'వందేమాతరం' విషయంలో కాంగ్రెస్ పార్టీ తీసుకున్న నిర్ణయంపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ 1937 నాటి తీర్మానాన్ని అనుసరిస్తూ జాతీయ గేయంలోని తొలి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలని నిర్ణయించడం దేశాన్ని అవమానించడమేనని ఆయన విమర్శించారు. ఈ నిర్ణయం జాతి వ్యతిరేకమని ఆరోపించారు. కాంగ్రెస్ తీసుకున్న ఈ నిర్ణయం కేవలం రాజకీయ నిర్ణయం కాదని, దేశ ప్రజల మనోభావాలకు సంబంధించిన అంశమని అమిత్‌షా పేర్కొన్నారు. 'వందేమాతరం'పై కాంగ్రెస్ తీసుకున్న వైఖరికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు.

**భారత్ విభజనకు కాంగ్రెస్ విధానాలే కారణం**

కాంగ్రెస్ గతంలో అనుసరించిన సంతుష్టీకరణ విధానాల వల్లే దేశం రెండు ముక్కలైందని అమిత్‌షా ఆరోపించారు. గతంలో చేసిన తప్పుల నుంచి కాంగ్రెస్ ఎలాంటి పాఠాలు నేర్చుకోలేదని విమర్శించారు. 'వందేమాతరం' విషయంలోనూ అదే విధానాన్ని కొనసాగిస్తోందని అమిత్‌షా ఆగ్రహం వ్యక్తం చేశారు.

## సీఎం చంద్రబాబు ఆదర్శ పాలన అందిస్తున్నారు : ఎంపీ శ్రీభరత్



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రత్యక్ష పద్ధ తిలో జడ్పీ ఎన్నిక జరగాలంటూ ఏపీ కేబినెట్ తీసుకున్న నిర్ణ యాన్ని ఎంపీ శ్రీభరత్ అభినందించారు. గురువారం విశాఖ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మ్యూజియంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఎంపీ తిలకించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి విజయం సాధి స్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజలు ప్రశాంతంగా ఉన్నారని తెలిపారు. సీఎం చంద్రబాబు ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నారని కొనియాడారు. గత ప్రభుత్వం చేసిన అరాచకాలు నుంచి రాష్ట్రం ఇంకా పూర్తిగా రికవరీ అవ్వలేదని ఎంపీ అన్నారు. రాష్ట్రంలో మంచి ప్రతిపక్షం లేదని... ప్రతిపక్షంలో ఉన్నవారికి వారి పాత్ర అర్థం కావడం లేదని చెప్పుకొచ్చారు. ఎల్‌నినో వలన నీటి సమస్య తలెత్తుతోందన్నారు. దీన్ని ఆసరాగా తీసుకొని డేటా సెంటర్ల వలన నీటి సమస్య వస్తోందని కొన్ని శక్తులు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. డేటా సెంటర్లు రావడానికి ఇంకా రెండు సంవత్సరాల సమయం పడుతుందని తెలిపారు. వర్షాల పైనే ఆధారపడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారని చెప్పారు. పోలవరం నీటిని విశాఖకు తీసుకువస్తున్నారని, నదులన్నీ అనుసంధానం అయిన తర్వాత దక్షిణ భారతదేశంలో నీటి సమస్య తగ్గుతుందని ఎంపీ శ్రీభరత్ వెల్లడించారు.

## అమరావతిలో ఎంట్రీకి అందుబాటులోకి రానున్న మరిన్ని రహదారులు.. మంత్రి సమీక్ష

**అమరావతి, (రాజధాని వార్తలు):** రాజధాని అమరావతిలో ఎంట్రీకి మరిన్ని రహదారులను త్వరితగతిన అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అందులో భాగంగా సీడ్ యాక్సెస్ రోడ్డు ప్రారంభంతో ఇతర రహదారుల కనెక్టివిటీపై మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి నారాయణ దృష్టి సారించారు. గురువారం ఇ 13, ఇ 15, ఇ 1, ఇ 3 రహదారి నిర్మాణ పనుల పురోగతిపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. మంగళగిరి నుంచి అమరావతికిలోకి ప్రవేశించే ఇ 15 రోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రికి అధికారులు వివరిం చారు. 16వ నెంబర్ జాతీయ రహదారి నుంచి ఎయిమ్స్ ద్వారా అమరావతిలోకి ఇ 13 రోడ్డు ప్రవేశించనుంది. సీడ్ యాక్సెస్ రోడ్డు (ఇ 3) మూడో ఫేజ్‌లో నిర్మించే ఎలివేటెడ్ కారిడార్ (స్టీల్ బ్రిడ్జి - మణిపాల్ హాస్పిటల్) పనులు కూడా త్వరగా ప్రారంభిం చాలని అధికారులకు మంత్రి నారాయణ సూచించారు. సీడ్ యాక్సెస్ రోడ్డుకు సమాంతరంగా కరకట్టను వెడల్పు చేస్తూ ప్రకాశం బ్యారేజీ వరకూ ఇ 1 రోడ్డును నిర్మిస్తున్నారు. ఆయా రోడ్ల నిర్మాణాలకు అవసరమైన రైల్వే ఇతర



అనుమతులు దాదాపు కొలిక్కి వచ్చాయని మంత్రి నారాయణ దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. రోడ్ల పనులకు ఆటంకాలు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా కలెక్టర్‌ను ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశానికి సీఆర్డీఏ కమిషనర్ విజయరామరాజు, అడిషనల్ కమిషనర్ కార్తీక్, గుంటూరు జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మతో పాటు వివిధ శాఖల ఇంజినీర్లు హాజరయ్యారు.

## రైతుల భూ సమస్యలకు భూ భారతి పరిష్కారం : మంత్రి పొంగులేటి

**ఖమ్మం, (రాజధాని వార్తలు):** జిల్లాలోని సత్తుపల్లి మండలం నారాయణపురం గ్రామంలో భూ రీ-సర్వేపై నిర్వహించిన అవగాహన సదస్సులో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖి నిర్వహించి వారి భూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని మొత్తం ఏడు గ్రామాల్లో భూ భారతి కార్యక్రమం కింద భూ సర్వే ప్రారంభమైనట్లు మంత్రి తెలిపారు.

గత ప్రభుత్వ హయాంలో భూమి లేకపోయినా బోగస్ పాస్‌పుస్తకాలు సృష్టించి రైతుబంధు నిధులు స్వాహా చేసిన ఘటనలు ఉన్నాయని ఆరోపించారు. రాజకీయాలకు అతీతంగా రైతులకు భద్రత కల్పించడమే లక్ష్యంగా భూ భారతి ద్వారా సర్వే చేపడుతు న్నామని స్పష్టం చేశారు. తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 70 గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నామని, ప్రతి ఆరు నెలలకు 70 గ్రామాల చొప్పున సర్వే కొనసాగించి ఏడాది న్నర కాలంలో ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. సర్వే ప్రక్రియలో రెవెన్యూ అధికారులు నిరంతరం కష్టపడుతున్నారని.. పూర్తయిన భూ వివరాలను కంప్యూటరీకరణ చేస్తున్నామని మంత్రి పొంగులేటి



పేర్కొన్నారు. భూ భారతి చట్టాన్ని రైతులకు ఉపయోగపడేలా రూపొందించామని, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ధరణి వ్యవస్థలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పుల కారణంగా రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు.

# సీరతున్ నబీ మురసం ఆధ్వర్యంలో ఎందుకు?

పాశ్చాత్య సామ్రాజ్యవాద శక్తులు, దేశీయ ఫాసిస్టు శక్తులు ఒక పథకం ప్రకారం ఇస్లామోఫోబియాను, ముస్లిం ఫోబియాను పెంచి పోషించాయి. నేడు ప్రపంచ వ్యాప్తంగా ముస్లిం సమాజంపై జరుగుతున్న దాడులకు కారణం ఇదే.మంచి చెడు ఒకటి కాజాలవు. మీరు చెడును ఉత్తమమైన మంచితో గెలవండి అని పవిత్ర ఖుర్ఆన్ చెప్తుంది. చెడు ప్రచారం ఉప్పెనలా ముంచు కొస్తుంటే దానికి ప్రత్యామ్నాయంగా మంచిని వ్యాప్తి చేయాల్సిన గురుతర బాధ్యతను ముస్లిం సమాజం విస్మరించటం ఒక వెనుకబాటుతనం. తెలుగు సాహిత్యంలో చాలా మంది ముస్లిం కవులమని చెప్పుకుంటారు. ప్రవక్త మీద ఓ కవితో, వ్యాసమో రాయటానికి గజగజ వణికిపోతారు. తమని ఎక్కడ మతవాదులని సాహిత్యంలో అణగతొక్కుతారనే భయం. మరికొంత మందిలో తమ ప్రోగ్రెసివ్ ముద్రలు చెరిగిపోతాయేమోనని భయం. ఇన్నేసి భయాలతో జీవించే వీరు మళ్లీ తమను తాము ముస్లిం కవులమని చెప్పుకుంటారు. మానవ సమాజానికి సామాజిక సమానత్వం, ఆర్థిక సమానత్వం, విశ్వమానవ ఐక్యత, మహిళల హక్కులు వితంతువులు, అనాథల గురించి బోధించటమే గాక ఆచరించి చూపిన ప్రవక్త ముహమ్మద్ (స) అనుయాయులమనుకునే వారు సాహిత్య రంగంలో ఉన్నప్పుడు ఓ కవితో,వ్యాసమో, కొన్ని అక్షరాలో ప్రవక్త స జీవితంపై రాయటం కనీసం బాధ్యత కాదా? మరీ ఇంత ఫోబియా ఎందుకు? నిజానికి ప్రవక్త స బోధించిన ప్రోగ్రెసివ్ విలువల్ని మనం పాటిస్తున్నామా? లేదా! అనేది ఆత్మ విమర్శ చేసుకోవాల్సిన అంశం. మేం సాహిత్య రంగంలో పెద్ద ప్రోగ్రెసివ్ అని చెప్పుకునేవారు ప్రవక్త స ఆచరించిన ప్రోగ్రెసివ్ విలువల్లో కనీసం ఒక్క శాతం ఐనా ఆచరించిన దాఖలాలు న్నాయా? ప్రవక్త స ప్రోగ్రెసివ్ అని ప్రైవేట్ మాటల్లో చెప్పేవారికి ప్రవక్త స గురించి నాలుగు మాటలు రాయటానికి బెరుకెందుకు? ముస్లిం సమాజం రెండు రకాల సమస్యలను ఎదుర్కొంటుంది. బయటి నుండి వచ్చే పీడన, అణిచివేత, రెండోది అంతర్గత మతఛాందసం. ఉష్ట్ర పక్షి ఇసుకలో తలదూర్చి బయటి ప్రపంచాన్ని చూడనట్లు మతఛాందసవాదులు బయటి సమాజాల్ని, బయటి ప్రపంచాన్ని చూడటం లేదు. తమ ఇస్లామియా సంస్కృతిని కాపాడుకుంటూనే చుట్టూ ఉన్న పీడిత సమాజాల్తో మమేకం కావడం లేదు.

ఆధునిక కాలంలో తమ విశ్వాసాలను కాపాడుకుం టూనే ఎలా ఆధునిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ముందుకు సాగాలో అర్థం చేసుకోవటం లేదు. నిజానికి తీవ్రవాదాలు ముస్లిం సమాజానికి తీరని నష్టం చేసాయి. దీని వెనుక ఉన్నది అమెరికన్ సామ్రాజ్యవాదులు, దాని తాబేదార్లు పాక్ పాలకులు. ఇవి సృష్టించిన హింసను వ్యతిరేకించటంతో పాటు మత సామరస్యానికి, మానవజాతి ఐక్యతకు, అన్ని కులాల, అన్ని మతాల పీడిత ప్రజల పక్షాన మురసం తన సాహిత్యాన్ని విస్తరిస్తుంది. మురసం మత రాజ్యం కోరుకోవడం లేదు. మతమే సమస్తం అని చెప్పడం లేదు. కానీ ఇస్లామోఫోబియాను జయించటం ముస్లిం కవులు, రచయితల కనీసం కర్తవ్యం... ఇస్లాం శాంతిని బోదించిందని ,ప్రవక్త స ప్రేమను బోధించారని చెప్పటం రాజ్యాంగ విరుద్ధం కాదు. భారత రాజ్యాంగ విలువలకు, సెక్యులర్ విలువలకు కట్టుబడి మనం ప్రయాణం చేస్తూనే ఇప్పటికైనా మహా ప్రవక్త జీవితంపై మీకు నచ్చిన సాహిత్య ప్రక్రియలో నాలుగక్షరాలు రాయండి. ప్రవక్త శాంతిని, సామరస్యాన్ని, ప్రేమను బోధించారని చాటి చెప్పండి... అందుకే మురసం రాష్ట్రవ్యాప్తంగా మీలాదున్ నబీ సందర్భంగా సీరతున్ నబీ కార్యక్రమాలు నిర్వహిస్తుంది.

# జర్నలిస్టు పి.గోవిందుపై దాడికి పాల్పడిన గుడివాడ కృష్ణను అరెస్టు చేయాలి

## - జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా
## - జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని డిమాండ్




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** పూసపాటిరేగ విశాలాంధ్ర విలేఖరి పి.గోవిందుపై దాడికి వ్యతిరేకంగా జర్నలిస్టులు కదం తొక్కి నిరసన గళమెత్తారు. కర్రలతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన గుడివాడ కృష్ణను తక్షణమే అరెస్టు చేయాలని జర్నలిస్టు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద గురువారం ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. పి.గోవిందు పూసపాటిరేగలో భూ అక్రమాలపై వార్తలు రాయడంతో కక్ష కట్టి భూ కబ్జాలకు పాల్పడుతున్న పి. గోవిందు ఈ దురాగతానికి దిగారన్నారు. అతను ఓ రాజకీయ పార్టీలో స్థానిక నేతగా ఉన్నాడని తెలుస్తుందని తక్షణమే అతన్ని ఆ పార్టీ నుండి బహిష్కరించాలని కోరారు. గోవిందుపై దాడికి పాల్పడినట్టు ఫోటోలు, వీడియోలు ఉన్నప్పటికీ ఇప్పటివరకు అతన్ని అరెస్టు చేయలేదని ఆరోపించారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఇది మీడియా స్వేచ్ఛపై దాడి అని, మీడియా స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు జర్నలిస్టులపై దాడుల నివారణ కమిటీలు గత 10 ఏళ్ళుగా పెండింగ్‌లో ఉన్నాయని తక్షణమే ఆ కమిటీలను రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. రామచంద్ర రావు,ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు కె.రాము, ప్రధాన కార్యదర్శి కె.చంద్రమోహన్, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.సత్యనారాయణ, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజు, అనిల్, సూర్య ప్రకాష్, జగదీష్, విశాలాంధ్ర బుక్ హౌస్ మేనేజర్ సనపల నరసింహం, విశాలాంధ్ర పత్రిక బ్యూరో చీఫ్ పి.రామకృష్ణ, కె.పరశురాం, గౌతమ్, కె. నరసింహం, దేవి శ్రీ,ఆర్, అబ్బాస్, ఎర్రయ్య రెడ్డి, కిషోర్, పి. సతీష్, బి.ఏ.నాయుడు, శ్రీలత, ఎం.శ్రీహరి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే గల్లా మాధవి




**అమరావతి, (రాజధాని వార్తలు):** జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే గల్లా మాధవి అసెంబ్లీలో గళమెత్తారు. ప్రతి జిల్లాలో అక్రిడిటేషన్ కలిగిన అర్హత ఉన్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్నారని, వారి సంక్షేమాన్ని ప్రభుత్వం ప్రత్యేకంగా పరిగణించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే గల్లా మాధవి పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపుపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఆమె అసెంబ్లీలో విజ్ఞప్తి చేశారు.

# జర్నలిజంలో డిప్లమో కోర్సుకు దరఖాస్తు గడువును సెప్టెంబర్ 5 వరకు పొడిగింపు

**అమరావతి, (రాజధాని వార్తలు):** సి.ఆర్.మీడియా అకాడమీ, నాగార్జున యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న "జర్నలిజంలో డిప్లమో కోర్సు"కు దరఖాస్తు గడువును సెప్టెంబర్ 5 వరకు పొడిగించినట్లు మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ ఆగస్టు 20న ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సు పట్ల వివిధ వర్గాల నుండి వస్తున్న విచారణలు, డిమాండ్ దృష్ట్యా మరియు జర్నలిస్టు సంఘాలు, పాత్రికేయుల విజ్ఞప్తి మేరకు గడువును పొడిగించామని ఆయన తెలిపారు. ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకునే జర్నలిస్టులు రూ.2 వేలు, ఇతర అభ్యర్థులు రూ.2 వేల 500 కోర్సు ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. ఫీజును సెక్రెటరీ, సి.ఆర్. మీడియా అకాడమీ పేరున ఏదైనా జాతీయ బ్యాంకు నుంచి డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో తీసుకోవాల్సి ఉంటుంది. జర్నలిస్టులకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత, జర్నలిజంలో అభిరుచి కలిగిన ఇతర అభ్యర్థులకు డిగ్రీ ఉత్తీర్ణత అర్హతగా నిర్ణయించారు.

# యువత చెడిపోవటానికి బాధ్యులు ఎవరూ..? సోషల్ మీడియానా? తల్లితండ్రులా, లేక గురువులా...?



నల్గొండ జిల్లా కొండమల్లేపల్లిలో నాగార్జున పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ రూపారెడ్డి (45) దారుణ హత్యకు గురైన ఘటన సమాజాన్ని తీవ్రంగా కలచివేస్తోంది. ఆగస్టు 11న జరిగిన ఈ ఘటనపై దర్యాప్తు చేసిన పోలీసులు, ముగ్గురు మైనర్ విద్యార్థుల ప్రమేయం ఉన్నట్లు వెల్లడించారు. వారిలో ఇద్దరు ఆమె పాఠశాలలోనే పదో తరగతి చదువుతున్న విద్యార్థులని తాజా నివేదికలు పేర్కొంటున్నాయి. ఒక ఉపాధ్యాయుడు విద్యా ర్థికి కేవలం పాఠ్యపుస్తకంలోని విషయాలను మాత్రమే బోధించడు. మంచి చెడులను వివరిస్తాడు. క్రమశిక్షణ నేర్పుతాడు. జీవితంలో సరైన మార్గాన్ని చూపిస్తాడు. అలాంటి గురువుపై విద్యార్థులే ఇంతటి ఘాతుకానికి పాల్పడ్డారనే వార్త మనందరినీ ఒక్కసారి ఆలోచింపజేయాలి.

అసలు తప్పు ఎక్కడ జరుగుతోంది?

తల్లిదండ్రులు తమ పిల్లలతో ప్రతిరోజూ మాట్లాడుతున్నారా? వారి స్నేహితులు ఎవరు? వారు సోషల్ మీడియాలో ఏమి చూస్తున్నారు? వారి ప్రవర్తనలో ఏమైనా మార్పులు వచ్చాయా? కోపాన్ని ఎలా నియంత్రించాలో వారికి నేర్పుతున్నామా?

పాఠశాలలో ఏం జరుగుతుంది ?

అదే విధంగా పాఠశాలలు కూడా కేవలం మార్కులు, ర్యాంకులు, ఫలితాలకే పరిమితం కాకుండా విలువలు, మానవత్వం, క్రమశిక్షణ, బాధ్యత, కోప నియంత్రణ, తప్పు-ఒప్పుల మధ్య తేడా వంటి అంశాలను విద్యార్థులకు బోధించాల్సిన అవసరం ఉంది.

తల్లిదండ్రులు ఒక్కసారి ఆలోచించాలి

పిల్లలకు ఖరీదైన ఫోన్లు, బైకులు, డబ్బు ఇవ్వడం మాత్రమే తల్లిదండ్రుల బాధ్యత కాదు.

పిల్లల మనసును చదవడం కూడా తల్లిదండ్రుల బాధ్యతే.

పిల్లలు తప్పు చేస్తే ప్రేమతోనే మందలించాలి. కానీ తప్పును సమర్థించడం మాత్రం చేయకూడదు. "నా పిల్లవాడు అలాంటి పని చేయడు" అనే నమ్మకంతో కాకుండా, "నా పిల్లవాడు మంచి మార్గంలో ఉన్నాడా?" అనే ప్రశ్నను ప్రతి తల్లి తండ్రి తనను తాను అడగాలి.

ఉపాధ్యాయుల బాధ్యత కూడా ఎంతో కీలకం

ఉపాధ్యాయులు విద్యార్థులలో కనిపించే అసాధారణ ప్రవర్తనను గమనించాలి. కోపం, హింసాత్మక ధోరణి, చెడు అలవాట్లు, మత్తు పదార్థాల ప్రభావం, నియంత్రణ లేని ఆన్‌లైన్ కంటెంట్ వంటి అంశాలపై పాఠశాల స్థాయిలోనే అవగాహన కల్పించాలి. విద్యార్థిని మందలించడం మాత్రమే కాకుండా, ఎందుకు మందలిస్తున్నామో అర్థమయ్యేలా చెప్పడం, అవసరమైనప్పుడు కౌన్సెలింగ్ అందించడం కూడా ముఖ్యమే.

సమాజం కూడా తన బాధ్యతను గుర్తించాలి

ఒకప్పుడు "గురువు" అనే పదానికి సమాజంలో ఎంతో గౌరవం ఉండేది. గురువు మందలిస్తే తల్లిదండ్రులు కూడా దానిని పిల్లల మంచికే అని భావించేవారు.

ఇప్పుడు పరిస్థితులు మారుతున్నాయి.

పిల్లలపై ప్రభావం చూపుతున్న సోషల్ మీడియా, హింసాత్మక కంటెంట్, చెడు స్నేహాలు, మత్తు పదార్థాలు, విచ్చలవిడి జీవనశైలి వంటి అంశాలపై కుటుంబం, పాఠశాల, సమాజం కలిసి పని చేయాల్సిన అవసరం ఉంది. ఒక ఉపాధ్యాయురాలిని కోల్పోవడం ఒక కుటుంబాన్ని మాత్రమే కాదు... ఒక విద్యా వ్యవస్థను, ఒక విలువను, ఒక సామాజిక బాధ్యతను ప్రశ్నిస్తోంది. పోటీలో గెలవడమే కాదు. ఓటమిని ఎలా స్వీకరించాలో కూడా నేర్పాలి... కోపంతో హింసకు పాల్పడకూడదని కూడా నేర్పాలి. గురువును గౌరవించని సమాజం భవిష్యత్తును ఎలా గౌరవిస్తుంది? ఈ ఘటన ప్రతి తల్లిదండ్రికి, ప్రతి ఉపాధ్యాయుడికి, ప్రతి పాఠశాల యాజమాన్యానికి, ప్రతి సామాజిక బాధ్యత కలిగిన వ్యక్తికి ఒక హెచ్చరిక. మన పిల్లల చేతుల్లో భవిష్యత్తు ఉంది. ఆ భవిష్యత్తు ఎలా ఉండాలో మనం ఈరోజే నిర్ణయించాలి....

మీ

**గాలిబ్ షహీద్**

ఆంధ్రప్రదేశ్ మైనార్టీ వెల్ఫేర్ ఫెడరేషన్

# రూ.11,285 కోట్లతో 51.56 లక్షల కాపులకు లబ్ధి : రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



**అమరావతి, (రాజధాని వార్తలు):** కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్ల కాలంలో కాపు కార్పొరేషన్ ద్వారా వివిధ పథకాల ద్వారా రూ. 11,285.72 కోట్లతో 51,56,172 లక్షల మందికి లబ్ధి చేకూర్చినట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. వర్షాకాల అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా గురువారం శాసన మండలిలో కాపు కార్పొరేషన్ ద్వారా కాపు సామాజిక వర్గీయులకు కూటమి ప్రభుత్వం ఎంతమేర నిధులు కేటాయించారు.. ఎంతమంది లబ్దిదారులకు ప్రయోజనం కల్పించారన్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తుల ప్రశ్నపై మంత్రి పైవిధంగా సమాధానమిచ్చారు. కాపు కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించామన్నారు. కాపుల అభివృద్ధికి కాపు కార్పొరేషన్‌కు ఏటా నిధులు కేటాస్తున్నామన్నారు. కాపుల అభివృద్ధికి కాపు కార్పొరేషన్ ద్వారా వెచ్చించిన వివరాలను బడ్జెట్ల వారీగా వివరించారు. 2024-25లో రూ.4,646.99 కోట్లు కేటాయించగా రూ.4.440.25 కోట్లు వెచ్చించి 9,55,144 మంది లబ్దిదారులకు ప్రయోజనం చేకూర్చామన్నారు. 2025-26లో రూ.4,924.28 కోట్లు కేటాయించగా, రూ. 4,360.28 కోట్లతో 20,63,907 మందికి లబ్ధి చేకూర్చామన్నారు. 2026-27లో రూ.5,012.10 కోట్లు కేటాయించగా, నేటి వరకూ రూ.2,485.19 కోట్లతో 21,37,121 మంది కాపులకు ప్రయోజనం చేకూర్చామని మంత్రి సవిత సవిత తెలిపారు.

# వృద్ధాశ్రమంలో ఘనంగా శ్రీహరి జన్మదిన వేడుకలు

**గూడూరు, (రాజధాని వార్తలు):** గూడూరు పట్టణంలోని సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో సంతదాసుపల్లి గ్రామానికి చెందిన ఇనుకుర్తి శ్రీహరి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. శ్రీహరి తల్లిదండ్రులు ఇనుకుర్తి శ్రీనివాసులు నాయుడు, శ్రీలక్ష్మి, సోదరుడు ఇనుకుర్తి సునీల్‌కుమార్ సహకారంతో వృద్ధాశ్రమంలోని వృద్ధులకు మధ్యాహ్నం రుచికరమైన భోజనం ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం కమిటీ సభ్యుడు పేపళ్ల అమరయ్య నాయుడు హాజరై శ్రీహరికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమంగా నిర్వహిస్తూ వృద్ధులకు భోజనం అందించిన శ్రీహరి కుటుంబ సభ్యులను అభినందించారు. పుట్టినరోజు వేడుకలను



వృద్ధాశ్రమంలో నిర్వహించి వృద్ధులకు భోజనం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింతగా కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పచ్చవ నరసింహానాయుడు, ఆరికట్ల మధుసూదన్‌నాయుడు, కేఆర్ఎం ఆశ్రమం నిర్వాహకురాలు శ్రీమతి కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

# రైతుల ఆదాయం పెంచే సాంకేతికతను క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలి

**- అగ్రి ఎక్స్‌పోలో ప్రదర్శించిన పరిజ్ఞానం ప్రతి రైతుకు చేరాలి : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల - అగ్రి ఎక్స్‌పోకు విశేష స్పందన - ఎల్‌నినో, వాతావరణ పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు శాస్త్రవేత్తల అవగాహన - వ్యవసాయ యంత్ర పరికరాల పట్ల రైతుల ఆసక్తి**







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చడంతో పాటు రైతుల ఆదాయాన్ని పెంచే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ సాగు విధానాలను క్షేత్రస్థాయిలో ప్రతి రైతుకు చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల సూచించారు. అగ్రి ఎక్స్‌పోలో ప్రదర్శించిన సాంకేతికత కేవలం ప్రదర్శనకే పరిమితం కాకుండా రైతుల పొలాల్లో ఆచరణలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. నెల్లూరులోని ఏ.సి. సుబ్బారెడ్డి స్టేడియంలో బుధవారం నిర్వహించిన అగ్రి ఎక్స్‌పో & కిసాన్ మేళా-2026 కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని వివిధ స్టాల్స్‌ను సందర్శించారు. వ్యవసాయ యంత్రాలు, డ్రోన్లు, ఆధునిక సాంకేతిక పరికరాలు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ అనుబంధ ఉత్పత్తులను పరిశీలించి, వాటి వినియోగం, రైతులకు కలిగే ప్రయోజనాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతుల అవసరాలు, క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న సమస్యలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతుల అవగాహన తదితర అంశాలపై కలెక్టర్ రైతులు, చాంపియన్ ఫార్మర్స్, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలతో ముఖాముఖిగా చర్చించారు. రైతులకు ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావడమే ఇటువంటి ఎక్స్‌పోల ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

**సాంకేతికత.. యాంత్రీకరణ.. శాస్త్రీయ సాగు**

అగ్రి ఎక్స్‌పోలో జిల్లాలోని వివిధ మండలాల నుంచి సుమారు 1,000 మంది రైతులు పాల్గొన్నారు. రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయ యాంత్రీకరణ, పంటల సాగు, పంటల ఆరోగ్యం, నీటి యాజమాన్యం, వ్యవసాయ అనుబంధ రంగాలు, ప్రభుత్వ పథకాలపై ఒకే వేదికగా అవగాహన కల్పించారు. వివిధ వ్యవసాయ యంత్రాలు, డ్రోన్లు, ఆధునిక సాగు పరికరాలు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, ఇతర సాంకేతిక ఉత్పత్తులను రైతులకు ప్రత్యక్షంగా ప్రదర్శించారు. వ్యవసాయ యంత్ర పరికరాల పనితీరు, వాటి వినియోగం, ప్రయోజనాలను తెలుసుకునేందుకు రైతులు ఆసక్తి చూపారు. తయారీదారులు, శాస్త్రవేత్తలు, అధికారులు రైతులతో ముఖాముఖిగా మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు.

**ఎల్‌నినో, వాతావరణ పరిస్థితులపై శాస్త్రవేత్తల సూచనలు**

నీటి లభ్యత, ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జొన్న, సజ్జ, మొక్కజొన్న, రాగి వంటి ప్రత్యామ్నాయ పంటల సాగును రైతులు పరిశీలించాలని శాస్త్రవేత్తలు సూచించారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో కంది, మినుము, పెసర, శనగ వంటి పప్పుధాన్యాలను సాగు చేసుకోవాలని సూచించారు. ఎల్‌నినో, వాతావరణ పరిస్థితుల ప్రభావంతో బోరు బావుల కింద సాగు చేసే వరి పంటలు ఎక్కువగా ప్రభావితమయ్యే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు తెలిపారు. కీలక దశల్లో పంటలకు అవసరమైన నీటిని అందించడంతో పాటు నీటి యాజమాన్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పంట అవశేషాలను కాల్చివేయకుండా పొలంలోనే సక్రమంగా వినియోగించడం ద్వారా నేలలో సేంద్రియ పదార్థం, పోషకాలు పెరుగుతాయని తెలిపారు. మట్టి పరీక్షల ఆధారంగా ఎరువులను వినియోగించాలని సూచించారు. నెల్లూరు ప్రాంతానికి అనుకూలమైన ఎన్ఎల్ఆర్ 36896 వరి రకానికి రైతుల్లో మంచి ఆదరణ ఉందని, ఎన్ఎల్ఆర్ 3238 రకంలో అధిక జింక్ శాతంతో పాటు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉన్నందున రైతులు ఈ రకాన్ని కూడా సాగు చేసి ప్రయోజనం పొందవచ్చని శాస్త్రవేత్తలు వివరించారు.

**రైతులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన**

పంటల బీమా, ప్రధానమంత్రి కిసాన్, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ యాంత్రీకరణ, డ్రోన్ల వినియోగం, పంట సాగుదారుల హక్కు కార్డులు, రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాల పంపిణీ తదితర అంశాలపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. సూక్ష్మ సేద్యంలో బిందు, తుంపర సేద్య పరికరాలకు అందుబాటులో ఉన్న రాయితీ, ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు లభించే సహాయం, ఉద్యాన పంటల అనంతర నిర్వహణకు సంబంధించిన రాయితీ పథకాలు, ఆయిల్‌పామ్ సాగు అవకాశాలను అధికారులు వివరించారు. మహిళా రైతులు స్వయం సహాయక సంఘాల్లో చేరడం ద్వారా బ్యాంకింగ్ సేవలు, రుణ సదుపాయాలు పొందడంతో పాటు తినడానికి సిద్ధంగా ఉండే, వంటకు సిద్ధంగా ఉండే ఉత్పత్తుల తయారీ, కోళ్లు, పశువుల పెంపకం వంటి ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**యువత వ్యవసాయాన్ని ఉపాధి అవకాశంగా చూడాలి: జెడ్పీ చైర్‌పర్సన్**

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అరుణమ్మ మాట్లాడుతూ, అగ్రి ఎక్స్‌పో రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. ముఖ్యంగా యువత వ్యవసాయాన్ని ఉపాధి అవకాశంగా స్వీకరించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. ఆధునిక సాంకేతికతలు, వ్యవసాయ పరికరాలను ఒకే వేదికపై తెలుసుకునే అవకాశం రైతులకు లభించిందన్నారు. ఎక్స్‌పోలో తెలుసుకున్న విషయాలను రైతులు తమ గ్రామాలకు తీసుకెళ్లి ఆచరణలో పెట్టాలని సూచించారు.

**రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలి: మేయర్**

మున్సిపల్ చైర్‌పర్సన్ దేవరకొండ సుజాత మాట్లాడుతూ, అగ్రి ఎక్స్‌పో ద్వారా రైతులకు అందించిన విజ్ఞానం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక మార్పులను రైతులు అందిపుచ్చుకోవాలని సూచించారు. ఒకే వేదికపై వివిధ వ్యవసాయ పరికరాలు, సాంకేతికతను తెలుసుకునే అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. రైతుల అభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు మరింతగా నిర్వహించాలని ఆకాంక్షించారు.

**వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రోత్సాహం**

పశుపోషణ, ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్, ఆహార శుద్ధి పరిశ్రమలు, రైతు యంత్ర పరికరాల అద్దె కేంద్రాలు, సూక్ష్మ సేద్యం వంటి వ్యవసాయ అనుబంధ రంగాల్లో ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అధికారులు వివరించారు. రైతులు వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలను కూడా చేపట్టి అదనపు ఆదాయం పొందే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. వ్యవసాయ అవసరాల కోసం వినియోగించే ట్రాక్టర్లు, ఇతర వాహనాలకు సంబంధించిన నిబంధనలు, రాత్రి వేళల్లో రహదారులపై ప్రయాణించే వ్యవసాయ వాహనాలకు ప్రతిబింబించే పట్టీ ఏర్పాటు వంటి రహదారి భద్రత అంశాలపై కూడా రవాణా శాఖ అధికారులు అవగాహన కల్పించారు.

**రైతులతో ముఖాముఖి**

కార్యక్రమం అనంతరం నిర్వహించిన రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రగతిశీల రైతులు పాల్గొన్నారు.

వివిధ పంటలు, నీటి యాజమాన్యం, పంట ఆరోగ్యం, వ్యవసాయ యాంత్రీకరణ, ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన అంశాలపై రైతులతో చర్చించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సత్యవాణి మాట్లాడుతూ, నూతన సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు, ఆధునిక ఎరువులు, పురుగుమందులు, వివిధ వ్యవసాయ ఉత్పత్తులను ఒకే వేదికపై రైతులకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో అగ్రి ఎక్స్‌పో నిర్వహించినట్లు తెలిపారు. సమగ్ర పంటల నిర్వహణ పద్ధతుల కింద రైతులకు అందిస్తున్న శిక్షణ, సాంకేతిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, పశుసంవర్ధక శాఖ జెడి రమేష్ నాయక్, డీసీవో గుర్రప్ప, వ్యవసాయ శాఖ ఏడీ అనిత, ఏపీఎంఐపీ పీడీ పద్మలత, వ్యవసాయ పరిశో ధనా స్థానం శాస్త్రవేత్తలు శ్రీలక్ష్మి, వినీత, శివజ్యోతి, శ్రీనివాసులు రెడ్డి, డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్ ఆత్మ ఉషారాణి, డీలర్లు, రైతులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శివయ్య సేవలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** భారత సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం శ్రీకాళహస్తికి విచ్చేసి శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జస్టిస్ ఎన్.వి. రమణ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీకాళహస్తీశ్వర స్వామివారిని, శ్రీ జ్ఞానప్రసూనాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దర్శనం అనంతరం ఆలయ అర్చకులు, వేద పండితులు వారికి వేద ఆశీర్వచనాలు అందించి స్వామి, అమ్మవార్ల తీర్థప్రసాదాలను అందజేశారు. కాగా ఆలయ అధికారులు, అర్చకులు జస్టిస్ ఎన్.వి.రమణకి, వారి కుటుంబ సభ్యులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ బి.కె.వెంకటేశులు తదితర ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## అంబరాన్నంటిన టిడిపి నేత గూడూరు శ్రీధర్ రెడ్డి జన్మదిన సంబరాలు

**- బాణాసంచా పేల్చి భారీ కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన టిడిపి నాయకులు, కార్యకర్తలు - పదవుల కోసం కాదు ప్రజల కోసం పనిచేస్తా .. ప్రజల జీవితాలలో మార్పు కనిపించే వరకు నా అడుగులు ఆగవు - మంత్రి నారాయణ సేవలు, చిరస్మరణీయం - నాకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు : శ్రీధర్ రెడ్డి**









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు సిటీ 8వ డివిజన్ టిడిపి సుప్రీమ్ నేత గూడూరు శ్రీధర్ రెడ్డి బుధవారం జన్మదిన వేడుకలు వారి నివాసం వద్ద వారి అభిమానులు టిడిపి నాయకులు కార్యకర్తలు అత్యంత వైభవంగా నిర్వహించారు. భారీ బాణాసంచా కాల్చి వారి చేత భారీ కేక్ కటింగ్ చేయించి, శాలువాలతో ఘనంగా సత్కరించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తనకు పదవుల ముఖ్యం కాదు డివిజన్ ప్రజలు ముఖ్యమని ప్రజల జీవితాలలో మార్పు కనిపించే వరకు ప్రత్యేక కృషి చేస్తానని మంత్రి నారాయణ సహకారంతో తమ డివిజన్లో కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## హ్యాపీ బర్త్ డే టూ యు గూడూరు శ్రీధర్ రెడ్డి

**- సేవా కార్యక్రమాలతో ఘనంగా గూడూరు శ్రీధర్ రెడ్డి బర్త్‌డే - నెల్లూరు సిటీలో సందడి. కూటమి నాయకుల ఘన నీరాజనం.. వెల్లువెత్తిన శుభాకాంక్షలు - మాటల నేతకాను..చేతల నేతను.. 8వ డివిజన్ అభివృద్ధి నా ఏకైక లక్ష్యం - డోర్ టు డోర్ టిడిపి కార్యక్రమం చేపట్టిన శ్రీధర్ రెడ్డి**









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు సిటీ 8వ డివిజన్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సుప్రీమ్ నేత గూడూరు శ్రీధర్ రెడ్డి బుధవారం జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా కూటమి ప్రభుత్వ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయన చేత భారీ కేక్ కట్ చేయించి శాలువాలతో సత్కరించి ఆనందాన్ని పంచుకోవడంతో పాటు భారీ ఫ్లెక్సీలు, స్థానిక ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి పేదలకు అన్నదానం చేపట్టారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, పదవులు ముఖ్యం కాదు ప్రజా సేవే తనకు ముఖ్యమని 8వ డివిజన్ ప్రజలకు ఏ కష్టం వచ్చినా నేనున్నానంటూ తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ డోర్ టు డోర్ టిడిపి కార్యక్రమం విస్తృతంగా చేపడుతున్నారు.

ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని భవిష్యత్తులో "నరసింహంలా" ఉన్నత పదవులు అధిరోహించాలని, సిటీ పరిధికి చెందిన ముఖ్య నాయకులు, బంధు మిత్రులు, భారీ సంఖ్యలో పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# సంపాదకీయం

## నవీన కాలానికి నవ జాతీయగీతం!

సదా కొత్తదనాన్ని ఆవాహన చేసుకోవడమే జీవ ధర్మం. మన కాలానికి అవసరమైన ఒక కొత్త జాతీయ గీతాన్ని సృజించాలని యువభారతీయులకు గుల్జార్ పిలుపునిచ్చారు. దేశం 80వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు జరుపుకున్న మరో మూడు రోజులకు గుల్జార్ 92వ ఏట ప్రవేశించారు. 'జనగణమన' లేదా 'వందే మాతరం' స్థానాన్ని భర్తీ చేసేందుకు కాకుండా సమకాలీన విభజనవాద రాజకీయాలను త్రోసిపుచ్చి, జాతిజీవనంలోని అపార వైవిధ్యాన్ని గౌరవించే ఒక అనుబంధ జాతీయ గీతాన్ని సృష్టించాల్సిన అవసరమున్నదని గుల్జార్ విజ్ఞప్తి చేశారు. తాము భారతీయులమనే ప్రగాఢ ఐక్యతా భావాన్ని పెంపొందించే ఒక కొత్త దేశభక్తి గీతాన్ని సృజించుకోవాలని అన్నారు. వర్తమాన భారతదేశం గొప్పదనాన్ని కీర్తించడంలో దశాబ్దాల నాటి పాత పాటలపై ఆధారపడకూడదని ఆయన అభిప్రాయపడ్డారు. సమకాలీన భారతీయ సమాజంలోని విభిన్న స్వరాలను ప్రతిబింబించేలా జాతీయ అస్తిత్వాన్ని పునర్ నిర్వచించుకోవాలని గుల్జార్ అన్నారు. తన కొత్త గీతం 'ఏక్ అకేలా హిందుస్థానీ, దో మిలే తో హిందుస్థాన్' వీడియో విడుదల సందర్భంగా గుల్జార్ ఆ విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి సాంస్కృతిక వైవిధ్యం ద్వారా ఆత్మీయత, ఐక్యతా భావాన్ని శ్రోత మనసులో నెలకొల్పే 'మిలే సుర్ మేరా తుమ్హారా' లాంటి గీతమది. గుల్జార్‌కు ప్రగాఢ అభిమానినే అయినప్పటికీ ఆయన సృజించిన 'ఏక్ అకేలా హిందుస్థానీ' ఇప్పుడు మనకు అవసరమైన కొత్త దేశభక్తి గీతం అని నేను భావించడం లేదు. అలా భావించాలని కవి కూడా కోరుకోలేదు. మన కాలానికి అవసరమైన కొత్త దేశభక్తి గీతాన్ని సృష్టించమని యువ భారతీయులను ఆయన ఆహ్వానించారు. ఆనందప్రదమైన విషయమేమిటంటే రవీంద్రుని 'జనగణమన' గానీ, బంకించంద్ర 'వందేమాతరం' గానీ తమ ప్రేరణాత్మక గుణాన్ని కోల్పోలేదు, కోల్పోవు కూడా. ఆ అజరామర గీతాల విశిష్ట చారిత్రక ప్రస్థానాన్ని టి.ఎమ్.కృష్ణ తన ఇటీవలి పుస్తకం 'ఔవ ఎప్త్రవ ౯ావశీజూశ్రీవ శీట ×అసఱుః ఇవషశీస-ఱఅస్త్ర ాూ చీఢ్ఱశీఅ'ం ాఎఎశీశ్రీం'లో విపులంగా వివరించారు. నా తరం భారతీయులు 'జనగణమన' వినపడగానే గౌరవపూర్వకంగా లేచి నిలబడేవారు. ఆ ఆచారం కాలం గడుస్తున్న కొద్దీ కొత్త అర్థాలను సంతరించుకున్నది. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమింప చేయడంలో ఆ అధికారిక జాతీయ గీతం అశేష ప్రజలకు ఎనలేని స్ఫూర్తినిచ్చింది. బంకించంద్ర 'వందేమాతరం' కూడా అంతే స్ఫూర్తిదాయకమైనది. ఆకాశవాణి వినిపించే 'వందేమాతరం' కాకుండా 'ఆనంద్ మఠ్' సినిమాలోని పాటే నాకు బాగా నచ్చింది. ఈ రెండు గీతాలూ పవిత్రమైనవి, ఉత్కృష్టమైనవి, అన్ని సందర్భాలలోను ఆలాపించేందుకు యుక్తమైనవి. దేశభక్తి గీతాల పట్ల అనురక్తి, గౌరవభావం నిండుగా వ్యక్తమైన భారతదేశంలో నేను పెరిగాను. ఇక్బాల్ 'సారే జహాన్ సే అచ్ఛా, హిందుస్థాన్ హమారా'ను విస్మరించగలమా? స్వాతంత్ర్యోద్యమం నుంచి మనకు వారసత్వంగా సంక్రమించిన ఉదాత్తగీతమది. భారత జాతీయవాదం సంకుచితమైనదికాదు. మన పొరుగుదేశం, శత్రు రాజ్యం పట్ల వ్యతిరేక భావాలను పురిగొల్పేదికాదు. 'జో జిసాసే మిలా సీఖా హమ్నే/ గైరోంకో భీ అప్నాయ హమ్నే' (కలిసిన ప్రతి ఒక్కరి నుండి నేర్చుకున్నాం, అపరిచితులను కూడా సొంతవారిగా స్వీకరించాం) అన్న విశ్వ దృక్పథంతో మన జాతీయవాదం భారత్‌ను విశిష్టంగా నిర్వచించింది. 1960లు, 1970ల్లోని మా బోటి పిల్లలకు 'ఆవో బచ్చో తుమ్హే దిఖాయే', 'హమ్ లాయేహై తూఫాన్ సే' మొదలైన దేశభక్తిగీతాలు ఆదర్శవంతమైన దేశాన్ని నిర్మించాలని ప్రబోధించాయి. మంచి పౌరులుగా ఎదిగేందుకు అవి స్ఫూర్తినిచ్చాయి. ఇక్బాల్ అజరామర గీతంలోని 'మజ్హబ్ నహీ సిఖాతా ఆపస్ మే బైర్ రఖ్నా' (ఒకరి పట్ల ఒకరు ద్వేషాన్ని పెంచుకోవాలని మతం బోధించదు) అన్న సత్యాన్నే సాహిర్ సుప్రసిద్ధ సినిమా గీతం 'తూ హిందు బనేగా నా ముసల్మాన్ బనేగా, ఇన్సాన్ కీ ఔలాద్ హై ఇన్సాన్ బనేగా' (ఒక బిడ్డకు ఏ మతం ముద్ర వేయకముందే వారు మొదట మనుషులుగా జన్మిస్తారు)లో కూడా ప్రతిధ్వనించింది. 'అప్నీ అజాదీ కో హమ్ హర్గిజ్ మిటా సక్తే నహీ' మొదలైన పాటలు స్వాతంత్ర్యం విలువను ఉద్ఘాటించాయి, 'సాథీ హాత్ బధానా', 'చోడో కల్ కీ బాతే' మొదలైనవి జాతి నిర్మాణంలో భాగస్వాములు కావాలని ప్రతి భారతీయుడినీ ఆహ్వానించాయి. తోటి మనుషులకు సేవ చేయడమే దేశాన్ని ఆరాధించడమని నా బాల్యంలో మేము పాడిన దేశభక్తి గీతాలు ఉద్బోధించాయి. ఈ ఉదాత్త భావనే నేను విశ్వసించే జాతీయవాదం. 1962, 1965, 1971 యుద్ధాల చరిత్ర ఆధారంగా నిర్మించిన సినిమా గీతాలు 'ఆయే మేరే వతన్ కే లోగో', 'కర్ చలే హమ్ ఫిదా' మొదలైన గీతాలు కూడా ఉదాత్త దేశభక్తిని ప్రేరేపించాయి గానీ సంకుచిత జాతీయోన్మాదాన్ని రెచ్చగొట్టలేదు. మనోజ్‌కుమార్ ప్రాచుర్యంలోకి తెచ్చిన దేశభక్తి కూడా నైతిక విలువలకు ప్రాధాన్యమిచ్చింది. అది నిరాడంబర దేశభక్తి. మా చిన్నతనంలో సినిమాలు చూడడానికి మా పెద్దలు అనుమతించేవారు కాదు. ప్రస్తావిత గీతాలు అన్నిటినీ తెరపై చూడడం కంటే రేడియో ద్వారానే ఎక్కువగా వింటుండేవాళ్లం. ఇప్పటి దేశభక్తి గీతాలు నాకు అంతగా స్ఫూర్తి నివ్వడం లేదు. వాటితో మమేకం కాలేకపోతున్నాను. ఆస్వాదించలేకపోతున్నాను. రాజకీయ స్పృహతో రాసిన కవిత్వం అర్థవంతమైనది. అటువంటి కవితలను తరచు చదువుతుంటాను. ప్రసిద్ధ కవి రఘువీర్ సహాయ్ వ్యంగ్య కవిత 'అధినాయక్' స్వాతంత్ర్యానంతరం కూడా సామాన్య ప్రజల దుస్థితి మారలేదని అధిక్షేపించింది. వినోద్ కుమార్ శుక్లా 'లగ్భగ్ జైహింద్' దేశభక్తి సూత్రాలకు, వాస్తవ మానవ శ్రేయస్సుకు మధ్య ఉన్న అంతరాన్ని బహిర్గతం చేసింది.

# సముద్రంలో ముమ్మరంగా గాలింపు చర్యలు

### - నావికాదళం, తీర రక్షక దళం, మెరైన్, కోస్ట్ గార్డ్ సముద్రాన్ని జల్లెడ పడుతున్నాయి
### - కోస్ట్ గార్డుకు చెందిన 5, నేవీ 2 అధునాతన బోట్లు, రెండు విమానాలతో విస్తృత గాలింపు
### - క్షేమంగా తిరిగి వస్తారని భావిస్తున్నాం : మంత్రి అచ్చం నాయుడు







**అల్లవరం, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఓడలరేవు ఫిషింగ్ ల్యాండింగ్ సెంటర్ నుంచి సముద్రంలో వేటకు వెళ్లి ఆచూకీ తెలియని ఏడుగురు మత్స్యకారులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన సహాయక, గాలింపు చర్యలను చేపట్టిందని జిల్లా ఇన్‌చార్జి, మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. అల్లవరం మండలం ఓడలరేవులో బోటులో వేటకు వెళ్లిన 7 గురు మత్స్యకారుల కుటుంబ సభ్యులతో మంత్రి అచ్చం నాయుడు, ఎంపీ గంటి హరీష్ మాధుర్, జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్, ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, దాట్ల బుచ్చిరాజు, బొమ్మిడి నాయకర్, మత్స్యశాఖ కమిషనర్ రామ శంకర్ నాయక్, జాయింట్ కలెక్టర్ వై.ఖోమ్. నైడియా దేవి, జిల్లా ఎస్పీ రాహుల్ మీనాలతో కలిసి మాట్లాడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయి పరిస్థితిని పర్యవేక్షిస్తూ గల్లంతైన మత్స్య కారుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. వేటకు వెళ్లిన బోటు, అందులోని ఏడుగురు మత్స్యకారుల సమాచారం తెలియకపోవడంతో వెంటనే అప్రమత్తమైన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు స్పందించి గాలింపు చర్యలలో భాగంగా తూర్పు నౌకాదళ కమాండెంట్, భారత తీర రక్షణ దళం కమాండెంట్ అధికారులకు, విశాఖపట్నం మెరైన్ ఐజి జెట్టి, కోస్ట్ గార్డ్ దళాలకు సమాచారం ఇచ్చి తక్షణం గాలింపు చర్యలు ప్రారంభించామని మంత్రి తెలిపారు. గాలింపు చర్యలు ముమ్మరంగా జరుగుతున్నాయని కోస్ట్ గార్డ్‌కు చెందిన 5, నావికా దళానికి చెందిన 2 అధునాతన స్పీడ్ బోట్లు, నావికా దళానికి చెందిన రెండు అధునాతన విమానాలు సముద్రంలో విస్తృతంగా గాలింపు చేపడుతున్నాయని మంత్రి తెలి పారు. సముద్రంలో 150 నాటికల్ మైళ్ళ దూరం వరకు ఈ ఏడు బోట్లు, విమానాలు గస్తీ చేపట్టిన సమాచారం లేకపోవడంతో 300 నాటికల్ మైళ్ళ రేంజ్ వరకు గస్తీ చేపడుతున్నట్లు మంత్రి అచ్చం నాయుడు తెలిపారు. పారాదీప్ ప్రాంతం వైపు వెళ్లే అవకాశాన్ని బట్టి ఒడిస్సా మెరైన్ అధికారులకు సమాచారం ఇచ్చామని, పశ్చిమ బెంగాల్ వైపు వెళ్ళిందేమోనని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి, అస్సాం ప్రభుత్వానికి సమాచారం ఇచ్చామని ప్రతి చిన్న అంశాన్ని పరిశీలిస్తున్నామని మంత్రి తెలిపారు. బోటులో ఉన్న 7 గురి మత్స్యకారుల ప్రాణాలను రక్షించేందుకు ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తుందన్నారు. వేటకు వెళ్లిన నాటి నుండి సముద్రం అల జడిగా లేదని మత్స్యకారులు క్షేమంగా తిరిగి వస్తారని నమ్మకంగా భావిస్తున్నామన్నారు. బోటులో అనుభవం గల డ్రైవర్ ఉన్నారని అనేక ప్రతికూల పరిస్థితులలో అనేక మందిని రక్షించి బోట్లను ఒడ్డుకు చేర్చిన అనుభవం గల డ్రైవర్ ఉండటంతో వారంతా క్షేమంగా తిరిగి వస్తారని నమ్మకం, విశ్వాసం ఉందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ప్రభుత్వం నిమిషం కూడా వృధా చేయకుండా ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తూ మత్స్యకారులను రక్షించటమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి అన్నారు. బోటును ఇటీవల కొనుగోలు చేశారని బోటులో ట్రాన్స్ ఫాండర్ ఇంకా బిగించినందునే లొకేషన్ గుర్తించలేకపోతున్నామని నూటికి నూరు శాతం బోట్లు ట్రాన్స్పాం డర్ లేకుండా సముద్రంలో వేటకు వెళ్లవద్దని మంత్రి తెలిపారు. ట్రాన్స్‌ఫాండర్‌లు ప్రభుత్వం సబ్సిడీతో బోటు యజమానులకు సరఫరా చేస్తుందని ట్రాన్స్పాండర్ ఉంటే ఇటువంటి పరిస్థితి ఏర్పడేది కాదని మంత్రి అచ్చం నాయుడు అన్నారు. మరో కొద్ది గంటలలో వేటకు వెళ్లిన మత్స్యకారుల ఆచూకీ దొరికే అవకాశం ఉందని కుటుంబ సభ్యులు ఎవరు ఆందోళన చెందవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ ఏ సరళావతి, మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు, అమ్ముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, అల్లవరం మండలం టిడిపి అధ్యక్షులు దెందుకూరు సత్యనారాయణ రాజు, మత్స్యశాఖ జేడీ కరుణాకర్, పెచ్చెట్టి చంద్రమౌళి, చిక్కాల గణేష్, పెమ్మాడి సాయి, కొల్లు విష్ణుమూర్తి, కొప్పాడి రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కరపలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం






**కరప, (రాజధాని వార్తలు):** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కరప మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు మల్లిపూడి వీర వెంకట సత్యనారాయణ మూర్తి (బాబులు) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఫోటోగ్రఫీ రంగానికి చెందిన పలువురు సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫోటో గ్రఫి పితామహుడు, ఫోటోగ్రఫీ రంగానికి విశేష సేవలం దించిన శ్రీ లూయిస్ – జాకస్ – మండె డాగురే చిత్రపటానికి అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు తెమ్మనబోయిన వీరభద్రరావు, గౌరవ సలహాదారు పోలిశెట్టి శ్రీను, అధ్యక్షులు మల్లిపూడి వీర వెంకట సత్యనారాయణ మూర్తి తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఫోటోగ్రఫీ ప్రాధాన్యతను, సమాజంలో ఫోటోగ్రాఫర్ల పాత్రను ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు. ఒక సంఘటనను మాటల్లో వివరించలేని సందర్భాల్లో ఒక్క ఫొటో ఎన్నో విషయాలను కళ్లకు కట్టినట్లు చూపిస్తుందని, చరిత్రలో జరిగిన అనేక ముఖ్యమైన ఘట్టాలను భవిష్యత్ తరాలకు అందించడంలో ఫోటోగ్రఫీ ఎంతో కీలక పాత్ర పోషిస్తుందని వారు పేర్కొన్నారు. వివాహాలు, శుభకార్యాలు, సామాజ కార్యక్రమాలు, రాజకీయ సమావేశాలు, ప్రకృతి దృశ్యాలు, ప్రజా సమస్యలు ఇలా ప్రతి రంగంలోనూ ఫోటోగ్రాఫర్ల సేవలు ఎంతో విలువైనవని తెలిపారు. కాలానుగుణంగా ఫోటోగ్రఫీ రంగంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో ఫోటో, వీడియో గ్రాఫర్లకు కొత్త అవకాశాలు ఏర్పడ్డాయని అన్నారు. నేటి డిజిటల్ యుగంలో ఫోటోగ్రఫీ కేవలం జ్ఞాపకాలను భద్రపరచడానికే కాకుండా వార్తలు, సమాచా రాన్ని ప్రజలకు చేరవేయడంలో కూడా కీలకంగా మారిందని పేర్కొన్నారు. అనంతరం ప్రపంచ ఫోటో గ్రఫీ దినోత్సవం సందర్భంగా పరిసర ప్రాంతాల్లోని దుకాణాలకు అసోసియేషన్ సభ్యులు స్వీట్లు పంపిణీ చేశారు. పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ ఫోటోగ్రఫీ రంగ అభివృద్ధికి, వృత్తిలో ఉన్న ఫోటో మరియు వీడియోగ్రాఫర్ల సంక్షేమానికి ఐక్యంగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్య క్రమంలో ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసి యేషన్ సభ్యులు, స్థానిక ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు తదితరులు పాల్గొన్నారు.

# గల్లంతైన 7 మంది మత్స్యకారుల కోసం ముమ్మరంగా గాలింపు



**అమలాపురం, (రాజధాని వార్తలు):** సముద్రంలోకి చేపల వేటకు వెళ్లిన 7 గురు మత్స్యకారుల ఆచూకీ కనుగొనేందుకు సముద్రంలో సహాయక, గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని అమలాపురం ఎంపీ హరీష్ బాలయోగి తెలిపారు. ఆగస్టు 3వ తేదీన సముద్రంలో చేపల వేటకు వెళ్లిన వీరంతా రెండు రోజుల తరువాత నుండి వారి కుటుంబ సభ్యులకు ఎటువంటి సమాచారం అందకపోవడంతో వారి కుటుంబ సభ్యులు అధికారులను ఆశ్రయించారు. అప్పటి నుంచి కోస్ట్ గార్డ్, నేవీ, మెరైన్ పోలీసులు, పోలీస్ శాఖ, మత్స్య శాఖలతో సమన్వయం చేస్తూ విస్తృత స్థాయిలో గాలింపు చర్యలు చేపడుతున్నారని హరీష్ బాలయోగి తెలిపారు. కాకినాడలో బుధవారం కోస్ట్‌గార్డ్ అధికారులను కలిసి ఆచూకీ తెలియని మత్స్యకారులను గుర్తించేందుకు సహాయక, గాలింపు చర్యలను మరింత వేగవంతం చేసి వారి కుటుంబ సభ్యుల వద్దకు చేర్చాలని ఎంపీ కోరారు. ఆయన వెంట క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్, అల్లవరం మండల పార్టీ అధ్యక్షులు దెందుకూరి సత్యనారాయణ రాజు, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్ తదితరులు ఉన్నారు.

# సముద్రంలో నిశితంగా పరిశీలించాలి



**అమలాపురం, (రాజధాని వార్తలు):** సముద్రంలో ఆచూకీ లేకుండా పోయిన బోటు దానిలోని ఏడుగురు మత్స్యకారులను రక్షించేందుకు సముద్రంలో నిశితంగా పరిశీలిస్తున్నామని విశాఖప ట్నం రేంజ్ మెరైన్ ఐజి గోపీనాథ్ జెట్టి తెలిపారు. కాకినాడలోని ఇండియన్ కోస్ట్ గార్డ్, కోస్టల్ సెక్యూరిటీ పోలీస్, ఇండియన్ నేవీ, మత్స్యశాఖ అధికారులతో ఆయన బుధవారం సమీక్షించారు. కోస్టల్ సెక్యూరిటీ పోలీస్, సీనియర్ కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ అధికారులు, ఇండియన్ కోస్ట్ గార్డ్ అధికారులతో కలిసి కాకినాడలోని ఐసిజిఎస్‌తో గాలింపు, రక్షణ చర్యలను సమన్వయం చేసి సెర్చ్ ఆపరేషన్‌లో ఆయన పాల్గొన్నారు. అదృశ్యమైన మత్స్యకారుల బోటు అందులోని సిబ్బందిని గుర్తించేందుకు సముద్రంలో నెలకొన్న పరిస్థితులను సమీక్షించారు. బోటు జాడ తెలుసుకొనేందుకు ఇండియన్ కోస్ట్ గార్డ్ గాలింపు, రక్షణ చర్యలకు 5 కోస్ట్ గార్డ్ బోటులను, నేవీ 2 స్పీడ్ బోటులను, రెండు అధునాతన విమానాలతో గాలింపు చేపడుతున్నట్లు ఐజి తెలిపారు. సముద్రంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న మత్స్యకార బోట్లను అప్రమత్తం చేసి, అదృశ్యమైన బోటును గుర్తించేందుకు సహకరించాలని కోరామన్నారు. సముద్రంలో గాలింపు చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయని అధైర్య పడవద్దని ఆయన మత్స్యకార కుటుంబాలను కోరారు.

# సానా సతీష్ జన్మదినం సందర్భంగా వికలాంగులకు స్టీల్ హాట్‌బాక్సుల పంపిణీ



**కరప, (రాజధాని వార్తలు):** రాజ్యసభ సభ్యులు, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సానా సతీష్ బాబు జన్మదినం సందర్భంగా కరపలో వికలాంగులకు స్టీల్ హాట్ బాక్సులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు వికలాంగులకు ఏదైనా సహాయం అందించాలని సానా సతీష్ బాబును కోరగా, ఆయన వెంటనే స్పందించి స్టీల్ హాట్‌బాక్సులను పంపించారు. దీంతో బుధవారం కరప మెరక వీధిలోని రామాలయం వద్ద సానా సతీష్ బాబు తరఫున వికలాంగులకు హాట్‌బాక్సులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, కాకినాడ పార్లమెంట్ అడ్వైజరీ కమిటీ సభ్యులు దేవు వెంకన్న, పేపకాయల తణుకుల రాజు తదితరులు పాల్గొన్నారు. సానా సతీష్ బాబు జన్మదినాన్ని పురస్కరించుకుని వికలాంగులకు సహాయం అందించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

# ఎక్స్‌ట్రా రెమ్యూనరేషన్.. ప్రభాస్- రాజమౌళి మధ్య ఇంట్రెస్టింగ్ డిస్కషన్!



టాలీవుడ్‌లో హీరోగా ప్రభాస్ స్థానం ఎంత ప్రత్యేకమో.. ఆయన వ్యక్తిత్వం గురించి ఇండస్ట్రీలో వినిపించే మాటలు కూడా అంతే ఆసక్తిని కలిగిస్తుంటాయి. ముఖ్యంగా దర్శకధీరుడు రాజమౌళితో ప్రభాస్‌కు ఉన్న అనుబంధం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఛత్రపతి సినిమాతో మొదలైన వీరి ప్రయాణం.. బాహుబలి, బాహుబలి2 సినిమాలతో మరింత స్ట్రాంగ్ బాండింగ్‌గా మారింది. తాజాగా ప్రభాస్ వ్యక్తిత్వానికి సంబంధించిన ఓ ఇంట్రెస్టింగ్ విషయాన్ని రాజమౌళి వెల్లడించారు. ఓ సందర్భంలో ప్రభాస్ ఎక్స్‌ట్రా రెమ్యూనరేషన్ తీసుకునే విషయంలో కూడా ఎంతో సింపుల్‌గా ఆలోచించాడని రాజమౌళి చెప్పుకొచ్చారు. నిర్మాత శోభు యార్లగడ్డ ప్రభాస్‌ను కలిసి ఎక్స్‌ట్రా రెమ్యూనరేషన్ ఇస్తామని చెప్పినప్పుడు.. ప్రభాస్ తనకు ఫోన్ చేసి మనం అలా తీసుకోవచ్చా? అని అడిగాడని, “వాళ్లే ఇస్తామని అంటున్నారు కదా.. తీసుకో” అని తాను ప్రభాస్‌కు చెప్పినట్లు రాజమౌళి తెలిపారు. అయితే, ప్రభాస్ మాత్రం ఆ మొత్తాన్ని తీసుకోవడంపై కూడా ఒకటికి రెండుసార్లు ఆలోచించాడని ఆయన చెప్పారు. నేను రెండు సినిమాలు చేస్తే కవర్ అయిపోతుంది. వాళ్లు లైఫ్ రిస్క్ పెట్టి తీశారు కదా అని ప్రభాస్ తనతో అన్నాడని రాజమౌళి చెప్పారు. అంతేకాదు.. ఆ టైమ్‌లో ఫైనాన్షియల్‌గా సిట్యుయేషన్ కాస్త టైట్‌గా ఉందని, ఏదైనా యాడ్ చేస్తే బాగుంటుందేమోనని ప్రభాస్ తనతో చెప్పినట్లు రాజమౌళి వెల్లడించారు. దానికి తాను ‘పర్లేదు.. హ్యాపీగా తీసుకో’ అని చెప్పానని, ప్రభాస్ క్యారెక్టరే అంత అంటూ ఆ సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ ప్రభాస్ స్వభావం గురించి రాజమౌళి చెప్పిన మాట ఇప్పుడు ఆసక్తిని రేకెత్తిస్తోంది. సినిమా కోసం భారీ స్థాయిలో పనిచేసే హీరోగా మాత్రమే కాకుండా.. నిర్మాతలు, సినిమా వెనుక ఉన్న వ్యక్తుల గురించి కూడా ఆలోచించే మనస్తత్వం ప్రభాస్‌లో ఉందని ఈ ఘటన మరోసారి చూపిస్తోంది. ముఖ్యంగా నిర్మాత స్వయంగా ఎక్స్‌ట్రా రెమ్యూనరేషన్ ఇస్తానన్నప్పుడు కూడా తీసుకోవచ్చా? అని డైరెక్టర్‌ను అడగడం ఆయన వ్యక్తిత్వానికి అద్దం పడుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాజమౌళి- ప్రభాస్ బాండింగ్ కేవలం డైరెక్టర్- హీరో సంబంధానికే పరిమితం కాలేదు. ఛత్రపతి నుంచి బాహుబలి2 వరకు కలిసి పనిచేసిన అనుభవం.. ఇద్దరి మధ్య వ్యక్తిగతంగా కూడా ఎంతో నమ్మకాన్ని పెంచింది.

ఇప్పుడు ప్రభాస్ గురించి రాజమౌళి చెప్పిన ఈ మాటలు మరోసారి ఆ బాండింగ్‌ను గుర్తు చేస్తున్నాయి. ముఖ్యంగా రెమ్యూనరేషన్ కంటే సినిమా కోసం రిస్క్ తీసు కున్న నిర్మాతల గురించి ప్రభాస్ ఆలోచించిన తీరు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.


# ఇది అమ్మాయిల సమస్య మాత్రమే కాదు.. అనుపమ విషయంలో అదితి షాకింగ్ కామెంట్స్






సినీ సెలబ్రిటీల పర్సనల్ లైఫ్‌కు సంబంధించిన విషయాలు బయటకు వచ్చినప్పుడు సోషల్ మీడియాలో డిస్కషన్ ఒక్కసారిగా హీటెక్కడం సాధారణమే. ముఖ్యంగా రిలేషన్‌షిప్స్, బ్రేకప్స్ వంటి అంశాలు తెరపైకి వచ్చినప్పుడు అసలు విషయానికంటే ఎవరు తప్పు? ఎవరు ఒప్పు? అనే డిస్కషనే ఎక్కువగా కనిపిస్తుంటుంది. అయితే హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ రీసెంట్ గా చేసిన కామెంట్స్ విషయంలో మరో ఇంట్రెస్టింగ్ యాంగిల్ తెరపైకి వచ్చింది. అనుపమ కామెంట్స్‌పై హీరోయిన్ అదితి శంకర్ రియాక్ట్ అవుతూ, ఈ అంశాన్ని కేవలం వ్యక్తిగత వ్యవహారంగా కాకుండా, చాలామందికి సంబంధించిన విషయంగా చూడాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అనుపమ ఇంటర్వ్యూలో మాట్లాడిన విషయాన్ని తాను ఇటీవలే తెలుసుకున్నానని చెప్పిన అదితి, అయితే అందులో ఎవరో ఒకరిని కించపరచాలనే ఉద్దేశం తనకు కనిపించలేదని, ఒక వ్యక్తి తన ఎక్స్‌పీరియెన్స్‌ను తన కోణంలో చెప్పుకోవడం సహజమేనని ఆమె భావించినట్లు తెలుస్తోంది. దీంతో ఇప్పటివరకు సోషల్ మీడియాలో జరుగుతున్న డిస్కషన్‌కు భిన్నంగా అదితి కామెంట్స్ మరో దిశలో డిస్కషన్‌కు కారణమవుతున్నాయి. ముఖ్యంగా రిలేషన్‌షిప్స్‌లో ఎదురయ్యే సమస్యలను కేవలం మహిళల అనుభవాలకే పరిమితం చేయకూడదనే అంశాన్ని అదితి ప్రస్తావించడం ఆసక్తికరంగా మారింది. కొన్ని సందర్భాల్లో పురుషులు కూడా తమకు ఎదురవుతున్న పరిస్థితిని వెంటనే గుర్తించలేకపోవచ్చని, రిలేషన్‌షిప్‌లో ఎదురయ్యే మానసిక ఒత్తిడి, అసౌకర్యం లేదా ఇబ్బందులను అర్థం చేసుకోవడంలో ఆలస్యం కావచ్చని, అందుకే ఇలాంటి అనుభవాల గురించి బహిరంగంగా మాట్లాడటం వల్ల సమస్యలను గుర్తించే అవకాశం పెరుగుతుందని అదితి అభిప్రాయపడ్డారు. ఇదే ఇప్పుడు ఈ వ్యవహారంలో మెయిన్ డిస్కషన్‌గా మారుతోంది. ఒక సెలబ్రిటీ తన పర్సనల్ ఎక్స్‌పీరియెన్స్‌ను షేర్ చేసుకున్నప్పుడు దాన్ని కేవలం గాసిప్‌గా చూడాలా? లేక అలాంటి ఎక్స్‌పీరియెన్స్‌ల వెనుక ఉన్న సామాజిక అంశాన్ని కూడా గమనించాలా? అనే ప్రశ్న ముందుకు వస్తోంది. అనుపమ కామెంట్స్‌పై నెటిజన్లు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్న టైమ్ లో అదితి మాత్రం వ్యక్తిగత ఆరోపణలు, ఊహాగానాల జోలికి వెళ్లకుండా సమస్యను పూర్తిగా వేరే కోణంలో చూడటం విశేషం. అనుపమ చెప్పిన తన ఎక్స్‌పీరియెన్స్ కేవలం ఆమెకు సంబంధించినదైనా.. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొనే వారు సమాజంలో చాలా మంది ఉండొచ్చనే విషయాన్ని అదితి కామెంట్స్ గుర్తు చేస్తున్నాయి.

# సెకండ్ ఇన్నింగ్స్‌లో ఫుల్ బిజీగా త్రిష.. సినిమాలు, ఓటీటీతో పాటు పాలిటిక్స్!



సౌత్ సినీ ఇండస్ట్రీలో ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న త్రిష.. ఇప్పుడు కెరీర్‌లో మరో ఆసక్తికరమైన దశను కొనసాగిస్తున్నారు. సీనియర్ హీరోయిన్లకు అవకాశాలు తగ్గుతున్నాయనే అంచనాలను తలకిందులు చేస్తూ వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉంటున్నారు. ముఖ్యంగా కథ, పాత్రల ఎంపిక విషయంలో ఎంతో సెలెక్టివ్‌గా వ్యవహరిస్తూ సినిమాలతో పాటు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పైనా తన పరిధిని విస్తరించే ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవల కాలంలో త్రిష పేరు వరుసగా భారీ ప్రాజెక్టులతో వినిపిస్తోంది. స్టార్ హీరోల సినిమాల్లో కీలక పాత్రలు చేస్తూనే.. హీరోయిన్‌గా తన ఇమేజ్‌కు భిన్నమైన కథలను ఎంచుకునేందుకు ఆసక్తి చూపుతున్నట్టు తెలుస్తోంది. దీంతో ఆమె కెరీర్‌లో సెకండ్ ఇన్నింగ్ మరింత స్ట్రాంగ్ గా సాగుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకప్పుడు గ్లామర్, కమర్షియల్ సినిమాలకే పరిమితమైన ఇమేజ్ నుంచి బయటకు వచ్చి కంటెంట్ ఓరియెంటెడ్ క్యారెక్టర్ల వైపు కూడా ఆమె దృష్టి పెట్టడం ఈ మార్పుకు మెయిన్ రీజన్‌గా కనిపిస్తోంది. ఇదే సమయంలో ఓటీటీ కూడా త్రిష కెరీర్‌లో కీలకమైన వేదికగా మారుతోంది. ఇప్పటికే బృందా వంటి వెబ్ కంటెంట్‌తో డిజిటల్ ఆడియన్స్‌కు చేరువైన త్రిష.. ఇప్పుడు మరో వెబ్ సిరీస్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తోంది. ప్రముఖ డైరెక్టర్ నందినీ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ ప్రాజెక్ట్ అమెజాన్ ప్రైమ్ వీడియో కోసం రూపొందనుందని టాక్. ఇది సూపర్‌నేచురల్ థ్రిల్లర్ నేపథ్యంతో ఉండనుందని తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు అఫీషియల్ గా అనౌన్స్ కావాల్సి ఉంది. మరోవైపు త్రిష పర్సనల్‌గా కూడా తమిళనాడులో చర్చనీయాంశంగా మారారు. ఆమె రాజకీయ రంగ ప్రవేశంపై గత కొంతకాలంగా సోషల్ మీడియాతో పాటు తమిళ రాజకీయ వర్గాల్లోనూ ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అఫీషియల్‌గా ఆమె పొలిటికల్ జర్నీపై ఎలాంటి క్లారిటీ లేకపోయినప్పటికీ.. ఈ అంశం మాత్రం త్రిష పేరును తరచూ వార్తల్లో నిలుపుతోంది. ఇలా చూస్తే ప్రస్తుతం త్రిష కెరీర్ ఒకే ట్రాక్‌లో సాగడం లేదు. థియేటర్లలో స్టార్ హీరోల సినిమాలు, ఓటీటీలో విభిన్నమైన కథలు, మరోవైపు పొలిటికల్ ఎంట్రీపై డిస్కషన్స్.. ఇలా మూడు విభిన్న అంశాలతో ఆమె పేరు రెగ్యులర్ గా వార్తల్లో కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో త్రిష సెకండ్ ఇన్నింగ్స్‌లో ఓటీటీకి మరింత ప్రాధాన్యత పెరుగుతోందా? అనే డిస్కషన్ కూడా మొదలైంది. ఇక రాబోయే రోజుల్లో ఆమె సెలెక్ట్ చేసుకునే ప్రాజెక్టులు ఈ కొత్త ఇమేజ్‌ను మరింత బలపరుస్తాయా అనేది ఆసక్తికరంగా మారింది.

# స్టార్‌డమ్ కొలతలు, ప్రామాణికత లెక్కలు మారాయ్.. ఈ తెలుగు హీరోనే ప్రూఫ్!



జపాన్ దేశం తెలుగు సినిమాలకు ఒక బలమైన ఓవర్సీస్ మార్కెట్‌గా రూపాంతరం చెందింది. ఈ క్రమంలో యంగ్ హీరో తేజ సజ్జా నటించిన ‘మిరాయ్’ చిత్రం విడుదల కాకుండానే జపాన్ గడ్డపై తన ప్రతాపాన్ని చూపిస్తోంది. డే-1 ముందస్తు అడ్వాన్స్ బుకింగ్స్‌లో జపాన్‌లో అత్యధిక బుకింగ్స్ సాధించిన టాప్ 10 భారతీయ చిత్రాల జాబితాలోకి మిరాయ్ చేరింది. ఇప్పటివరకు ఆర్.ఆర్.ఆర్, బాహుబలి 2, పుష్ప 2, దేవర, సలార్ వంటి భారీ చిత్రాలు మాత్రమే సాధించిన ఈ అరుదైన ఘనతను ఇప్పుడు ఒక యంగ్ హీరో అందుకోవడం విశేషం. అంతేకాకుండా ధురందర్ 2ను వెనక్కి నెట్టి సల్మాన్ ఖాన్ ‘టైగర్ జిందా హై’ రికార్డులకు చేరువగా వెళ్తుండటం ట్రేడ్ వర్గాలను సైతం ఆశ్చర్యపరుస్తోంది. జపనీస్ ప్రేక్షకులను భారతీయ స్టార్ హీరోలలో ప్రధానంగా ఆకర్షించే అంశం లార్జర్ ద్యాన్ లైఫ్ క్యారెక్టరైజేషన్..అమితమైన ఆత్మవిశ్వాసం- భావోద్వేగాలు. ప్రతికూల పరిస్థితులను దాటుకుని పోరాడే కథానాయకుడి తత్వాన్ని వారు బాగా ఇష్టపడతారు. దీనికితోడు జపనీస్ సంస్కృతికి, భారతీయ సంస్కృతికి మధ్య లోతైన ఆధ్యాత్మిక - సాంస్కృతిక బంధం ఉంది. ప్రకృతిని, దైవత్వాన్ని, పురాణాలను గౌరవించే సాంప్రదాయం రెండు దేశాల్లోనూ సమానంగా కనిపిస్తుంది. బాహుబలి, ఆర్.ఆర్.ఆర్ చిత్రాల్లోని ధర్మం కోసం పోరాడే నైతికత అక్కడి ప్రజలకు బాగా కనెక్ట్ అయింది కాబట్టే ప్రభాస్, ఎన్టీఆర్, రామ్‌చరణ్‌లను వారు తమ సొంత నటులుగా ఆదరించారు. ఇప్పుడు తేజ సజ్జా నటించిన మిరాయ్ కన్సెప్ట్ కూడా జపనీస్ సంస్కృతికి, వారి పురాణేతిహాసాలకు చాలా దగ్గరగా ఉండే అంశాలపై చర్చ సాగుతోంది. జపనీస్ అనిమే - మాంగా సంస్కృతిలో ఫాంటసీ ప్రపంచం, ప్రాచీన రహస్యాలు, విజువల్స్, కర్మ సిద్ధాంతాలకు అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. మిరాయ్ కథాంశం భారతీయ ఇతిహాసాలు, అశోకుడి 9 రహస్య గ్రంథాల నేపథ్యంతో కూడుకున్న ఫాంటసీ యాక్షన్ డ్రామా కావడం వల్ల ఇది జపనీస్ పురాణ కథల్లోని మిస్టరీ అండ్ సూపర్ నేచురల్ కాన్సెప్టులకు అత్యంత ఆప్ట్‌గా సరిపోతుంది. ఇప్పటివరకు ప్రభాస్, ఎన్టీఆర్, చరణ్‌లాంటి మాస్ అండ్ కట్-ఔట్ హీరోలను చూసిన జపనీస్ ప్రజలు, తేజ సజ్జాలాంటి నవతరం హీరోని కూడా అదే కోణంలో ఆదరిస్తారా అనే ప్రశ్నకు మిరాయ్ అడ్వాన్స్ బుకింగ్స్ సరైన సమాధానం ఇస్తున్నాయి. జపాన్ ప్రేక్షకులకు కేవలం ఒక నటుడి భౌతిక రూపం- లుక్కు మాత్రమే ముఖ్యం కాదు, ఆ పాత్రలోని వీరత్వం, కథలోని బలం ముఖ్యం. హనుమాన్ సినిమాతో ఇప్పటికే జపాన్‌లో అడుగుపెట్టి రూ. 1 కోటి వసూలు చేసిన తేజ సజ్జా, తన పాత్రలోని అమాయకత్వం, దైవిక శక్తి లభించినప్పుడు చూపించే శౌర్యంతో అక్కడి ప్రేక్షకులను మెప్పించాడు. ఇప్పుడు మిరాయ్ ద్వారా సరికొత్త హీరో ఇమేజ్‌ను సొంతం చేసుకుంటున్నాడు. ఓవర్సీస్ మార్కెట్‌లో తేజ సజ్జా ప్రతి సినిమాతో తన స్థాయిని పెంచుకుంటూ పోతున్నాడు. హనుమాన్ ఇచ్చిన బలమైన పునాదితో ఇప్పుడు మిరాయ్ సాధిస్తున్న ట్రెండ్ చూస్తుంటే తెలుగు సినిమా జపాన్ విజయాల చరిత్రలో మరొక సంచలనాత్మక అధ్యాయం లిఖించబడటం ఖాయంగా కనిపిస్తోంది. భారతీయ పురాణాలు, లార్జర్ ద్యాన్ లైఫ్ విజువల్స్, జపనీస్ మైండ్ సెట్‌కు సరిపోయే ఫాంటసీ ఎలిమెంట్స్ సరిగ్గా కుదిరితే తేజ సజ్జా కూడా జపాన్‌లో తిరుగులేని ప్రజాదరణ పొందే నవతరం గ్లోబల్ స్టార్‌గా నిలవడం ఖాయం. కెరీర్ ఆరంభమే తేజ సజ్జాలాంటి హీరో సల్మాన్ ఖాన్ రికార్డుకు చేరువగా వెళుతున్నాడు! అని చర్చించుకోవడం తెలుగు వారిలో ఎంత క్రేజీగా ఉంటుందో ఒకసారి ఊహించండి. ఇదీ సినీజగత్తులో మహత్తు అంటే!

# పి.సి.పి.యన్.డి.టి చట్టం ఉల్లంఘనలపై కఠిన చర్యలు

## - లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు - యాక్ట్‌పై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలి : జిల్లా కలెక్టర్ యస్.రాంసుందర్ రెడ్డి








**విజయనగరం, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా ప్రజల్లో పెద్ద ఎత్తున ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ యస్.రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మాతా శిశు మరణాలపై వైద్యారోగ్య శాఖ అధికారులతో కలిసి ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. మాతృ మరణాలకు గల ప్రాథమిక వైద్య కారణాలు, క్షేత్రస్థాయి నుంచి అందించిన ఆరోగ్య సేవలు, వివిధ ఆసుపత్రుల్లో లభించిన చికిత్స తదితర అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు. గర్భిణులకు హిమోగ్లోబిన్, బీపీ వంటి కీలక పరీక్షలతో పాటు అన్ని ల్యాబ్ టెస్టులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల పరిధిలోగల 19 స్కానింగ్ సెంటర్లు మరియు ప్రైవేటు పరిధిలో గల 109 స్కానింగ్ సెంటర్లలో స్కానింగ్ సక్రంగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గర్భిణుల స్కానింగ్ నివేదికలను తప్పనిసరిగా జనరల్ ఫిజీషియన్లకు చూపించి వైద్య పరీక్షలు నిర్వహించాలని స్పష్టం చేశారు. గర్భధారణ సమయంలో ప్రమాదకర లక్షణాలు కనిపిస్తే తక్షణమే అప్రమత్తమై తగిన వైద్య సలహాలు, చర్యలు తీసుకోవాలని సూచించారు. శిశు మరణాల నివారణకు సైతం పలు కీలక సూచనలు చేశారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, చేయించుకోవడం లేదా ప్రోత్సహించడం నేరమని, విస్తృతంగా ప్రచారం మాంధ్యమాలు ద్వారా ప్రచారం చేయాలని అన్నారు. జిల్లాలో ఎక్కడా భ్రూణహత్యలు జరగడానికి వీల్లేదని కలెక్టర్ ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. గుట్టు చప్పుడు కాకుండా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే వైద్య ఆరోగ్యశాఖ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనివేళల్లో వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా అందుబాటులో ఉండి రోగులకు ఉత్తమ సేవలు అందించాలని నిర్దేశించారు. పి.సి.పి.యన్.డి.టి చట్టం 1994ను సమర్ధవంతంగా అమలుచేయడానికి ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమన్నారు. ఎవరైనా పి.సి.పి. యన్.డి.టి చట్టాన్ని ఉల్లంఘిస్తే టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ నెంబర్ 18002332447 కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో రెవెన్యూ డివిజనల్ అధికారి, సుధా సాగర్, జిల్లా వైద్యశాఖ అధికారి, జీవనరాణి, డి.సి.హెచ్.ఎస్.ఎన్.పి. పద్మశ్రీ రాణి, డి.ఎల్.ఏ.టి.ఓ, రాణి, డెమో, చిన్న తల్లి, డిప్యూటీ డెమో, వి.మహేశ్వరి, కమిటీ మెంబర్లు, పలువురు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు





**విజయనగరం, (రాజధాని వార్తలు):** శ్రీశ్రీ కళా వేదిక, కుసుమంచి ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకల్లో భాగంగా విదేశాల నుండి వచ్చిన సైబీరియా పక్షులపై ప్రత్యేకంగా ఫోటో షూట్ చేయడం జరిగింది. ఈ ఉత్సవంలో శ్రీశ్రీ కళా వేదిక ఉపాధ్యక్షులు మరియు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ విజేత పి రాజేశ్వరరావు ప్రత్యేకంగా ఫోటో షూట్ చేసిన ఫోటోలు ప్రదర్శించారు.

ప్రపంచ ఆర్యవైశ్య మహా సభ మహిళా విభాగ విజయనగరం అధ్యక్షురాలు గిరిజా ప్రసన్న కెమెరా చేత పట్టి సైబీరియా పక్షులకు ప్రత్యేకంగా ఫోటోలు తీశారు. ఈ కార్యక్రమంలో వేదిక అధ్యక్షులు గురు ప్రసాద్ కుసుమంచి ఫౌండేషన్ వ్యవస్థాపకులు కుసుమంచి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం పరిష్క రించుకొని జిల్లా స్థాయిలో గల ఫోటోగ్రాఫర్లకు, కెమెరామెన్‌లకు ఫూల్ బాగ్‌లో అభినందన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.

# జిల్లాలో ఎరువుల కొరత లేదు - రైతులు ఆందోళన చెందవద్దు

## - జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు

**విజయనగరం, (రాజధాని వార్తలు):** ఖరీఫ్-2026 సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులను సకాలంలో అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయ శాఖ, మార్క్‌ఫెడ్ సమన్వయంతో నిరంతర చర్యలు చేపడుతున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి విటి రామారావు తెలిపారు. ఆగస్టు 18 నాటికి జిల్లాలో 20,043 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కాగా, ప్రారంభ నిల్వతో కలిపి మొత్తం 24,859 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని, ఇప్పటివరకు 14,998 మెట్రిక్ టన్నుల యూరియా విక్రయించామని తెలిపారు. అదనంగా మార్క్‌ఫెడ్ బఫర్ స్టాక్‌గా 886 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. ఇతర ఎరువుల్లో డీఏపీ 7,545 మెట్రిక్ టన్నులు, ఎంఓపీ 1,245 మెట్రిక్ టన్నులు, ఎన్‌పీకే 9,147 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 2,253 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీటిలో ఇప్పటివరకు డీఏపీ 2,295, ఎంఓపీ 251, ఎన్‌పీకే 2,662, ఎస్ఎస్‌పీ 771 మెట్రిక్ టన్నులు విక్రయించినట్లు వివరించారు. ఎరువుల సరఫరా, నిల్వలు, విక్రయాలను వ్యవసాయ శాఖ అధికారులు ప్రతిరోజూ పర్యవేక్షిస్తున్నారని, రైతు సేవా కేంద్రాలు, రీటైలర్ల ద్వారా దశలవారీగా ఎరువులు అందిస్తున్నామని తెలిపారు. రైతులు ఎరువుల కొరతపై అపోహలకు గురి కావద్దని, అవసరానికి మించి కొనుగోలు చేసి నిల్వ చేసుకోవద్దని సూచించారు. APAIMS యాప్ ద్వారా ఎరువుల పంపిణీని డిజిటల్‌గా పర్యవేక్షిస్తున్నామని, రైతుల భూమి విస్తీర్ణం, పంట అవసరాల ఆధారంగా యూరియా, డీఏపీ కొనుగోళ్లను నియంత్రిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే ఎరువులు విక్రయించేలా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, జిల్లాలో ఎరువుల కొరత లేకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టినట్లు జిల్లా వ్యవసాయ అధికారి విటి రామారావు స్పష్టం చేశారు.

# సర్ ప్రక్రియ, రీ-సర్వే పనులను శరవేగంగా పూర్తి చేయాలి : ఐటీడీఏ పీఓ ఆర్.వైశాలి



**మక్కువ, (రాజధాని వార్తలు):** ఎన్నికల ప్రత్యేక సమగ్ర సవరణ, రీ-సర్వే పనులను నిర్దేశిత గడువులోగా వేగవంతంగా పూర్తి చేయాలని పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆర్.వైశాలి అధికారులను ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ల సవరణ ప్రక్రియలో భాగంగా పెండింగ్‌లో ఉన్న నోటీసుల పంపిణీ, అందిన ఫారాల స్వీకరణ, క్షేత్రస్థాయి పరిశీలన మరియు దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మండలంలో క్షేత్రస్థాయిలో రీ సర్వే పనులను వేగవంతం చేసి,ఎలాంటి జాప్యం లేకుండా లక్ష్యాలను చేరుకోవాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. అనంతరం మక్కువ ప్రధాన రహదారిపై కొనసాగుతున్న కల్వర్ట్ నిర్మాణ పనులను పరిశీలించారు. కల్వర్ట్ నిర్మాణంలో సాంకేతిక, నాణ్యతలకు లోబడి నిబంధనలు పాటించాలన్నారు. రహదారి వినియోగదారులకు, స్థానిక ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలక్కుండా వేగవంతముగా, నిర్ణీత గడువు లోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మండలంలోని వెంకట బైరిపురం నుండి తూరు మామిడి వరకు జరుగుతున్న రహదారి నిర్మాణ పనులను పరిశీలించి, రహదారి నిర్మాణ నాణ్యత, పనుల పురోగతి, వినియోగిస్తున్న మెటీరియల్ను స్వయంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన సాంకేతిక ప్రమాణాలు, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగానే పనులు జరగాలని, సంబంధిత కాంట్రాక్టర్లలు అధికారులకు, దిశా నిర్దేశం చేశారు. రహదారి నిర్మాణంలో ఎటువంటి లోపాలు లేకుండా, నిర్ణీత గడువులోగా పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నిరుపేదల ఆర్థిక పరిపుష్టికి అందరూ కృషి చేయాలి : డీఆర్డీఏపిడి సిహెచ్.ప్రభావతి




**మక్కువ, (రాజధాని వార్తలు):** నిరుపేదల ఆర్థికా భివృద్ధికి వెలుగు మహిళా సమాఖ్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా డిఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ సిహెచ్. ప్రభావతి అన్నారు. స్థానిక వెలుగు మహిళా సమాఖ్య భవనంలో వన్ డిస్ట్రిక్ట్ - వన్ మండల్ - జీరో పోవర్టీ మిషన్‌పై సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ గ్రామాలలో నిరుపేదలు ఎంపిక అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలన్నారు. ఎంపికలో ఎటువంటి అర్హులైన నిరుపేద కుటుంబాలు మిగిలిపోకుండా, అనర్హుల్కు అవకాశం కల్పించకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిర్దేశించిన సమయంలోగా పేదల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. నిరుపేదల గుర్తింపు, ఎంపిక కార్యక్రమంలో వివిధ శాఖల సిబ్బంది, స్వయం సహాయక సంఘ సభ్యుల సహకారం తీసుకోవాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో అందరి భాగస్వామ్యంతో, వాస్తవ పరిస్థితులను తెలుసుకొని, నిరుపేద కుటుంబాలను గుర్తించాలని స్పష్టం చేశారు. అనంతరం 2026-2027 ఆర్థిక సంవత్సరానికి చేపట్టిన వార్షిక జీవనోపాధి, రుణ ప్రణాళిక అమలు పై గ్రామ సంఘాల వారీగా, క్లస్టర్ వారీగా సమీక్ష నిర్వహించారు. ప్రతి గ్రామ సంఘం పరిధిలో అర్హులైన స్వయం సహాయక సంఘ సభ్యుల జీవనోపాధి అభివృద్ధికి అవసరమైన రుణ సహాయం అందేలా సమన్వయంతో పనిచేయాలని సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో డి ఆర్ డి ఏ వెలుగు ప్రాజెక్ట్ మేనేజర్ పి. శ్రీనివాసరావు, వెలుగు ఏపీఎం జయ కుమార్ సీసీ, వివోఏలు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ సర్ప్‌కు ప్రతిష్టాత్మక పీఎం ఎఫ్ఎంఈ అవార్డు

## - ఆహార ప్రాసెసింగ్ రంగంలో స్వయం సహాయక సంఘాల మహిళల ప్రగతికి గుర్తింపు : మంత్రి కొండపల్లి హర్షం






**విజయనగరం, (అమరావతి), (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సర్ప్) ప్రతిష్టాత్మక పిఎం ఎఫ్ఎం ఈ అవార్డు లభించడం పట్ల రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 24, 25 తేదీలలో న్యూఢిల్లీలోని ఇండియా హ్యాబిటాట్ సెంటర్‌లో నిర్వహించే పి ఎం ఎఫ్ ఎం ఈ కాన్‌క్లేవ్‌లో ఈ అవార్డును సెర్ప్ అధికారులకు ప్రధానం చేసేందుకు ఏపీ సెర్ప్ అధికారులను కేంద్ర మంత్రిత్వ శాఖ ఆహ్వానించడం ముదావాహమని మంత్రి కొనియాడారు. పీఎం ఎఫ్ఎంఈ పథకం కింద సీడ్ క్యాపిటల్ కాంపోనెంట్‌లో ఆమోదిత పనితీరు ప్రమాణాల ఆధారంగా ఎస్ఆర్ఎల్ఎంల పనితీరును మూల్యాంకనం చేయగా, ఆంధ్రప్రదేశ్ సెర్ప్ సమగ్ర పనితీరు ఆధారంగా విజేతగా ఎంపికైనట్టు మంత్రి తెలిపారు. ఈ అవార్డు సర్ప్ సంస్థకు మాత్రమే దక్కిన గౌరవం కాదని.. రాష్ట్రంలోని వేలాది స్వయం సహాయక సంఘాల మహిళల శ్రమ, పట్టుదల, పారిశ్రామిక స్ఫూర్తికి లభించిన గుర్తింపు అని మంత్రి ప్రశంసించారు. పి ఎం ఎఫ్ ఎం ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా స్వయం సహాయక సంఘాలకు ఆహార ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపన, వ్యాపారాభివృద్ధి, ఉపాధి కల్పనకు అవకాశాలు మరింత విస్తృతమవుతాయని మంత్రి తెలిపారు. మహిళలను కేవలం లబ్ధిదారులుగా కాకుండా వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

ప్రతి మహిళా విజయవంతమైన పారిశ్రా మికవేత్తగా ఎదగాలన్న గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యానికి అనుగుణంగా సెర్ప్ పని చేస్తుందన్నారు. కేంద్ర అవార్డుకు ఎంపిక కావడం పట్ల సర్ప్ అధికారులు, సిబ్బంది, జిల్లా సమాఖ్యలు, మండల సమాఖ్యలు, గ్రామ సంస్థలు, స్వయం సహాయక సంఘాల మహిళలను మంత్రి ప్రత్యేకంగా కొనియాడారు. ఈ అవార్డు మా సెర్ప్ శాఖపై మరింత బాధ్యత పెంచిందని మంత్రి పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్‌ను మహిళా ఆధారిత ఫుడ్ ప్రాసెసింగ్ ఎంట ర్‌ప్రెన్యూర్‌షిప్‌కు దేశంలోనే ఒక ఆదర్శ రాష్ట్రంగా నిలబెట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి కొండపల్లి తెలిపారు.

# ఘనంగా ఆర్కాటు గంగమ్మ 4వ వర్ధంతి - విస్తృత సేవా కార్యక్రమాల నిర్వహణ













**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు పినాకిని లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు ఆర్కాటు శ్రీనివాసులు తల్లి స్వర్గీయ ఆర్కాటు గంగమ్మ 4వ వర్ధంతి కార్యక్రమం నెల్లూరులో ఘనంగా జరిగింది. వర్ధంతి సందర్భంగా విస్తృతంగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. స్వర్గీయ ఆర్కాటు గంగమ్మ భర్త ఆర్కాటు వెంక టేశ్వర్లు మొదలియార్ దాతృత్వంతో, నెల్లూరు పినాకిని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

ఇందులో భాగంగా వారి నివాసం వద్ద పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే నగరంలోని పప్పుల వీధి పార్కు, ఆత్మకూరు బస్టాండ్, రామచంద్రారెడ్డి హాస్పిటల్, సంతపేట కనికల హాస్పిటల్, కుక్కలగుంట మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం వద్ద స్వర్గీయ ఆర్కాటు గంగమ్మ జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కుటుంబ సభ్యులతో పాటూ లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. తరువాత 47, 48వ డివిజన్లకు చెందిన ప్రజలకు, నెల్లూరు క్లబ్‌లో పనిచేసే వర్కర్లకు దుప్పట్లను పంపిణీ చేశారు. అనంతరం లయన్స్ క్లబ్ కార్యాలయ ఆఫీస్ బాయ్ శీను పిల్లల చదువుల కోసం 3 వేలు, మూలాపేటకు చెందిన హరి అనే క్యాన్సర్ పేషెంట్‌కు 3 వేలు, గాంధీనగర్‌కు చెందిన ఓ విద్యార్థి చదువుల నిమిత్తం 3 వేలు, కనికల హాస్పిటల్ నర్స్ విజయమ్మకు 3 వేలు, కనికల హాస్పిటల్ వాచ్‌మెన్ పిల్లల చదువులకు 3 వేల వంతున ఆర్దిక సాయం అందజేశారు.

ఈ సందర్భంగా స్వర్గీయ ఆర్కాటు గంగమ్మ కుమారుడు ఆర్కాటు శ్రీనివాసులు మాట్లాడుతూ తన తల్లి కృషి కారణంగానే తాను ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నట్లు గుర్తు చేసుకున్నారు. తల్లి లేని లోటు తీర్చలేనిదని, అందుకే ఆమె జ్ఞాపకార్థం ప్రతీ సంవత్సరం పెద్ద ఎత్తున సేవా కార్యక్ర మాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్వర్గీయ ఆర్కాటు గంగమ్మ భర్త ఆర్కాటు వెంకటేశ్వర్లు మొదలియార్, నెల్లూరు పినాకిని లయన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ ప్రసాద్, కార్యదర్శి కే. బాలాజీ, ట్రెజరర్ వి. అనీల్ కుమార్, 47వ డివిజన్ కార్పొరేటర్ పొట్లూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా వీరంతా స్వర్గీయ ఆర్కాటు గంగమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

# త్వరలో రాజకీయ పార్టీ పెడుతున్నా...
## విజయసాయిరెడ్డి సంచలన ప్రకటన





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరుజిల్లా వాసి, ఒకప్పుడు వైసిపిలో నెంబర్ 2 గా వ్యవహరించి చక్రం తిప్పిన నేత, మాజీ రాజ్యసభ సభ్యులు వేణుంబాకం విజయసాయి రెడ్డి సంచలన ప్రకటన చేశారు. త్వరలో తాను రాజకీయ పార్టీని స్థాపించబోతున్నట్లు ప్రకటించారు. ఈ నెలలోనే విజయవాడలో మీడియా సమావేశం నిర్వహించి వివరాలు తెలియజేస్తానని వెల్లడించారు. బుధవారం ఉదయం ఆయన సతీమణి సునంద రెడ్డితో కలిసి తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. తిరుమలలో రాజకీయ ప్రసంగాలకు తావు లేదని అంటూ త్వరలో తాను రాజకీయ పార్టీని స్థాపించబోతున్నట్లు ప్రకటించారు. పూర్తి వివరాలు ఈ నెలాఖరులోపు విజయవాడలో మీడియా సమావేశం నిర్వహించి వెల్లడిస్తానన్నారు. రాజకీయ పార్టీ పెట్టబోతున్న నేపధ్యంలో స్వామి వారి ఆశీస్సుల కోసం వచ్చినట్లు తెలిపారు. ప్రజా పక్షంగా ప్రజల కోసం, ప్రజల గొంతుక వినిపించేందుకే పార్టీ స్థాపిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఎల్ నినో ప్రభావం లేకుండా దేశం సుభిక్షంగా ఉండాలని స్వామి వారిని వేడుకున్నట్లు తెలియజేశారు. నెల్లూరుజిల్లా, ముత్తుకూరు మండలం, తాళ్లపూడి గ్రామానికి చెందిన వేణుంబాక విజయసాయి రెడ్డి చార్టెడ్ అకౌంటెంట్ విద్యను అభ్యసించి చెన్నై, హైదరాబాద్, బెంగుళూరు నగరాల్లో సేవలు అందించారు. కొన్ని జాతీయ బ్యాంకులకు బోర్డు సభ్యునిగా కూడా వ్యవహరించారు. తరువాత ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ డైరెక్టరుగా పనిచేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబానికి నమ్మకస్తునిగా ఉంటూ వారి వ్యాపార సంస్థలకు చార్టెట్ అకౌంటెంట్‌గా పనిచేశారు. వైస్ రాజశేఖర్ రెడ్డి మరణానంతరం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ స్థాపనలో జగన్‌కు కుడిబుజంగా వ్యవహరించారు. మొదట్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో నంబర్ టూ లీడర్‌గా చెలామణి అయ్యారు. 2016లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున రాజ్యసభకు ఎన్నికయ్యారు. రెండవ దఫా కూడా విజయసాయి రెడ్డి రాజ్యసభకు ఎంపికయ్యారు. 2019లో రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి, జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక కూడా ఆయన వైసీపిలో కీలకంగా వ్యవహరించారు. జగన్ సిఎం అయిన మూడేళ్ల తర్వాత నుండి వైసిపిలో ఆయన ప్రాధాన్యం లేకుండా పోయింది. అలాగే విశాఖపట్నంకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తగా వ్యవహరించి పలు ఆరోపణలు ఎదుర్కొన్నారు. 2024 ఎన్నికల్లో అయిష్టంగానే నెల్లూరు పార్లమెంటు స్థానం నుండి పోటీ చేసి ఓటమి పాలైనారు. ఆ ఎన్నికల్లో జగన్ ఘోర ఓటమి, మద్యం కుంభకోణంలో వెలుగుచూశాక విజయసాయి రెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీతో పాటూ రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. తాజాగా ఏపిలో కొత్త రాజకీయ పార్టీ పెట్టనున్నట్లు ప్రకటించారు.

# రాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృత కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జిల్లాలో నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడి, ప్రజల భద్రతను మరింత పటిష్టం చేయడమే లక్ష్యంగా జిల్లా ఎస్పీ డా.అజితా వేజెండ్ల, ఐపిఎస్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో 19.08.2026 ఉదయం 5:30 గంటల నుంచి 7:30 గంటల వరకు రాపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో, రాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తూర్పు అగర్తకట్ట ప్రాంతంలో విస్తృత కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో రాపూర్ సబ్ ఇన్‌స్పెక్టర్, కలువాయి సబ్ ఇన్‌స్పెక్టర్‌లతో పాటు మొత్తం 20 మంది పోలీసు సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందం పాల్గొంది. ఈ సందర్భంగా గతంలో నేరాలకు పాల్పడిన వ్యక్తులు, సస్పెక్ట్ వ్యక్తులకు సంబంధించిన ఇళ్లను తనిఖీ చేసి, వారి ప్రస్తుత కార్యకలాపాలు మరియు కదలికలను పరిశీలించారు.

**30 ద్విచక్ర వాహనాల తనిఖీ**

CASO ఆపరేషన్‌లో భాగంగా 30 ద్విచక్ర వాహనాలను గుర్తించి తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించిన అనంతరం సరైన పత్రాలు ఉన్న వాహనాలను సంబంధిత యజమానులకు అప్పగించారు.

**ప్రజలకు అవగాహన కార్యక్రమం**

CASO ఆపరేషన్ అనంతరం రాపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలకు పలు ముఖ్యమైన అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల నియంత్రణ, ఎర్రచందనం అక్రమ రవాణా నివారణ, మహిళల భద్రత, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, బాల్య వివాహాల నివారణ, POCSO చట్టం, హెల్మెట్ ధరించడం, రోడ్డు భద్రత, సిసిటివి కెమెరాల ఏర్పాటు మరియు వాటి ఉపయోగాలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులకు ఓటిపిలు, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు లేదా వ్యక్తిగత సమాచారాన్ని అందించవద్దని సూచించారు. మహిళలు, బాలికల భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దని, పిల్లలపై ఎలాంటి వేధింపులు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. అలాగే మాదకద్రవ్యాలు మరియు ఇతర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పోలీసులు సూచించారు. నేరాల నియంత్రణలో భాగంగా ఇళ్ల వద్ద, వ్యాపార సంస్థల వద్ద జజుఎ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా భద్రతను మరింత పటిష్టం చేసుకోవచ్చని ప్రజలకు వివరించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో భాగంగా రాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటువంటి కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిరంతరం కొనసాగుతాయని, ప్రజలు పోలీసులకు సహకరించాలని జిల్లా పోలీసులు తెలిపారు.

# ప్రపంచ ఫోటోగ్రాఫర్లను ప్రోత్సహించాలి



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** ఫోటోగ్రఫీని ఒక వృత్తిగా మాత్రమే కాకుండా కళగా గుర్తించి ఫోటోగ్రాఫర్లను ప్రోత్సహించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. సామర్లకోట గడియారం సెంటర్ ఉషా స్టూడియో వద్ద ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్ల ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోటోగ్రఫీ ప్రాధా న్యత, సమాజంలో ఫోటోగ్రాఫర్ల పాత్ర, మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో ఫోటోగ్రఫీ రంగంలో చోటు చేసుకుంటున్న మార్పులపై చర్చించారు. 1839 ఆగస్టు 19న ఫ్రాన్స్ ప్రభుత్వం 'డాగ్యురోటైప్' సాంకేతికతను ప్రపంచ మానవాళికి ఉచిత బహుమతిగా ప్రకటించిన చారిత్రక ఘట్టానికి గుర్తుగా ప్రతి ఏటా ఆగస్టు 19న ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఫోటోగ్రఫీ సృష్టికర్త చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఒక మంచి ఛాయా చిత్రం కేవలం ఒక సంఘటనను మాత్రమే కాకుండా, ఆ కాలానికి సంబంధించిన జ్ఞాపకాలను, భావోద్వేగాలను భవిష్యత్ తరాలకు అందించే శక్తిని కలిగి ఉంటుందని వక్తలు పేర్కొన్నారు. ఫోటోగ్రఫీని కేవలం వృత్తిగా కాకుండా ఒక కళగా, చరిత్రను భద్రపరిచే మాధ్యమంగా గుర్తించి ఫోటోగ్రాఫర్లను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా సీనియర్ ఫోటోగ్రాఫర్ ఇరుసుమల్ల సూరిబాబు, గణేష్ ఘనంగా పూలమాలలు దుస్సాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్లు దర్శి పార్టీ సత్యానందం, నాని, సారా శ్రీను, రాము సూరిబాబు, చక్రి, నాలం శ్రీను, పెదిరెడ్ల శ్రీనివాస్, టేకు శీను, చింతల సత్యం, తదితర ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు పాల్గొన్నారు.

# మత్స్యకార కుటుంబాలకు వైఎస్ఆర్సిపి నిత్యవసర సరుకులు పంపిణీ



**అల్లవరం, (రాజధాని వార్తలు):** సముద్రంలో వేటకు వెళ్లి 17 రోజులు గడిచినా ఇప్పటివరకు వారి ఆచూకీ లభించకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్న కుటుంబ సభ్యులను అమలాపురం నియోజకవర్గ వైసిపి కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ బుధవారం కలిసి ధైర్యం చెప్పారు. బోటులో వేటకు వెళ్లిన మత్స్యకారుల కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని అధైర్య పడవద్దని వారి ఆచూకీ తెలుసుకునేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడి తమ వంతు సహకారం అందిస్తామని భరోసా కల్పించారు. బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులను అందజేసారు. అలాగే అమలాపురం మాజీ ఎంపీ చింత అనురాధ బాధిత కుటుంబాలను మంగళవారం కలుసుకొని ఓదార్చే ధైర్యం చెప్పారు.

సాధ్యమైనంత త్వరగా గాలింపు చర్యలు చేపట్టి సము ద్రంలో చిక్కుకున్న వారి ఆచూకీ కనుగొని వారి కుటుంబ సభ్యుల వద్దకు చేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆపద సమయంలో అండగా ఉండేందుకు బాధిత కుటుంబాలకు తమ వంతు సహకా రంగా అనురాధ ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చెల్లిబోయిన శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు కొనుకు బాపూజీ, ఎంపీపీ ఇళ్ల శేషారావు, రాష్ట్ర జోనల్ 2 ఆర్టీఐ విభాగ అధ్యక్షులు వర్మ, గ్రామ కమిటీ అధ్యక్షులు అవనిగడ్డ శేషగిరిరావు, మల్లాడి ఉమ మహేశ్వరరావు, భాను, కర్రి వెంకన్న, తిక్క ప్రసాద్, నాతి శ్రీను, చిలకలపూడి రాజు తదితరులు పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call 9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- , అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS


- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎఫ్టానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిన్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్‌పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# నెల్లూరు నెరజాణ 2026 ఆడిషన్స్ ప్రారంభం






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని స్థానిక మాగుంట లేఔట్ నందు శిరీష, షామిలి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 20వ తేదీ నిర్వహించనున్న నెల్లూరు నెరజాణ 2026 పోటీల కొరకు ఆడిషన్స్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లాకు చెందిన ఔత్సాహిక పోటీ దారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సెప్టెం బర్ 20వ తేదీ నిర్వహించనున్న గ్రాండ్ ఫినాలే నిర్వహిస్తున్నట్లు అందుకుగాను సెప్టెంబరు 10వ తేదీ వరకు ఆడిషన్స్ నిర్వహిస్తున్నట్లు కావున జిల్లాలోని ఔత్సాహిక పోటీదారులు పాల్గొనవలసిందిగా పిలుపునిచ్చారు. ఈ పోటీలలో పారదర్శకంగా జిల్లా వారు కాకుండా బయట ప్రదేశాల నుండి బయట రాష్ట్రాల నుండి న్యాయ నిర్ణేతలు వ్యవహరిస్తారని ప్రతి పోటీదారుని ప్రదర్శనలో వారు పొందిన మార్కులను డిస్ప్లే చేయడం జరుగుతుందని, పోటీలు చాలా పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. కావున జిల్లాలోని ఈ నెల్లూరు నెరజాణ కార్యక్రమంలో పాల్గొన్న దలచినవారు క్రింది నెంబర్ లు 9493679920, 7780261023, లను సంప్రదించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో వ్యాఖ్యాతగా యాంకర్ అఖిల్, ఐ మెమొరీ స్కూల్ కరస్పాండెంట్ రాజేంద్ర, నెల్లూరు క్లబ్ ట్రెజరర్ పిఎస్ఆర్ రాము, షి జోన్ ఫిట్నెస్ దీప్తి, హై కోర్ట్ అడ్వకేట్ వెంకట్. తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలక్టరు అధ్యక్షతన జరిగిన జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం

**- రెండో విడతలో 71 మంది మీడియా ప్రతినిధులకు అక్రిడిటేషన్ల మంజూరుకు ఆమోదం - 68 మీడియా అక్రిడిటేషన్లు, పేరు మార్పునకు 2, వెరిఫికేషనులో 1 ఆమోదం : జిల్లా కలక్టరు ఎస్.రాం సుందరరెడ్డి**




**విజయనగరం, (రాజధాని వార్తలు):** ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాల సమాచారాన్ని చేరవేయడంలో, ప్రజా సమస్యలను ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి తీసుకురావడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందని జిల్లా కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి అన్నారు. ప్రజలకు ప్రభుత్వ సమాచారం, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల వివరాలను చేరవేయడంలో మీడియా నిర్వహిస్తున్న కీలక పాత్రను గుర్తిస్తూ, అర్హత కలిగిన మీడియా ప్రతినిధులకు అక్రిడిటేషన్లు మంజూరు చేసే ప్రక్రియలో భాగంగా జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ రెండో విడత సమావేశం చైర్మను మరియు జిల్లా కలక్టరు ఎస్. రాం సుందరరెడ్డి ఆధ్యక్షతన బుధవారం కలక్టరు సమావేశం మందిరంలో జరిగింది. రెండో విడతలో 71 మంది మీడియా ప్రతినిధులకు అక్రిడిటేషన్ల మంజూరుకు కమిటీ సభ్యులు ఆమోదం తెలిపారు. కొత్తగా 68 మీడియా అక్రిడిటేషన్లు, పేర్లు మార్పునకు 2, వెరిఫికేషన్కు-1కు ఆమోదం తెలిపారు. రెండో విడత అక్రిడిటేషన్ల కోసం దినపత్రికలు, పీరియాడికల్స్, ఎలక్ట్రానిక్ మీడియా, కేబుల్ నెట్‌వర్క్ తదితర విభాగాల నుంచి ఆన్‌లైన్ ద్వారా అందిన దరఖాస్తులను కమిటీ నిబంధనల మేరకు పరిశీలించింది. మొత్తం 71 మంది మీడియా ప్రతినిధులు అర్హత సాధించగా, వారికి అక్రిడిటేషన్లు మంజూరు చేసేందుకు కమిటీ ఆమోదం తెలిపింది. పెద్ద, మధ్య తరహా దినపత్రికలు - 26, చిన్న దినపత్రికలు-13, పీరియాడికల్స్-3, ఎలక్ట్రానిక్ మీడియా-19, కేబుల్ నెట్‌వర్క్-2, అధికారిక మీడియా - సమాచార, పౌర సంబంధాల శాఖ-2, పేరు మార్పునకు 2, వెరిఫికేషన్కు 1 మొత్తం 71 మందికి ఆమోదం తెలిపింది.

ఈ సమావేశంలో జిల్లా మీడియా అక్రిడిటేషను కమిటీ కన్వీనరు పి.గోవిందరాజులు, సభ్యులు సి.పి.ఒ. బాలాజి, హౌసింగు పి.డి.మురళీ మోహన్, కార్మిక శాఖ సహాయ కమీషనరు జి.ఎల్లాజిరావు, డి.ఎల్ టి బిఒ డా. కె.రాణి, కమీటి మీడియో సభ్యులు బి.శ్రీనివాసరావు, పి.ఎస్. ఎస్.వి ప్రసాదరావు, వై.శ్రీరాములనాయుడు, బి.నాగేంద్ర ప్రసాద్, ఎం.పి.వెంకటేశ్వరపాత్రో, బి.జి.ఆర్.పాత్రో, మజ్జి శివ కుమార్, పి.అప్పారావు, సమాచార శాఖ పి.ఆర్.ఒ మజ్జి వాసు, ఎపిఆర్ఒ సిహెచ్. ప్రభుదాస్, తదితరులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan